Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక




సంపుటి : 26 | సంచిక : 183 | హైదరాబాద్ | బుధవారం 27 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

## కుటుంబాలకు రేవంత్ అండ

# బలహీనవర్గాలకు భీమా

సరికొత్త పథకంతో ప్రజలముందుకు..

జూన్ 2 నుంచి ప్రారంభించేందుకు యత్నం

ప్రిమియం మొత్తం రాష్ట్ర ప్రభుత్వానిదే..

సామాజిక భద్రతలో సరికొత్త మైలురాయి



రాష్ట్ర అవతర దినోత్సం సందర్భంగా రాష్ట్రంలోని కుటుంబాలకు భీమాతో సీఎం రేవంత్‌రెడ్డి ధీమా ఇవ్వను న్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పేరిట తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపె ట్టబోతున్న పథకం విధివిధానాల ఖరారు కోసం కేబినెట్ సబ్ కమిటీ అత్యవసరంగా సమావేశం కానుంది.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో సరికొత్త పథకంతో ప్రజల ముందుకు రాబోతోంది. రాష్ట్ర అవతర దినోత్సం సందర్భంగా రాష్ట్రంలోని కుటుంబాలకు భీమాతో సీఎం రేవంత్‌రెడ్డి ధీమా ఇవ్వనున్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పేరిట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టబోతున్న పథకం విధివిధానాల ఖరారు కోసం కేబినెట్ సబ్ కమిటీ అత్యవసరంగా సమావేశం కానుంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ప్రతి ఇంటికి రూ.5 లక్షల రక్షణ కవచం

తెలంగాణ బడ్జెట్ 2026–27లో ప్రకటించిన ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. కుల, మత, పేద, ధనిక అనే తేడాలు లేకుండా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం. కుటుంబ పెద్ద లేదా సంపాదించే వ్యక్తి అకస్మాత్తుగా మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదనే మానవీయ కోణంలో ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది, దీని కోసం బడ్జెట్‌లో సుమారు రూ. 4,000 కోట్లు కేటాయించారు.

### రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ ఉచిత బీమా

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొంటారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటి భాగస్వామ్య సంస్థలతో చర్చించి, క్లెయిమ్ ప్రాసెస్ సరళీకరణ, లబ్ధిదారుల డేటా సేకరణ, అర్హత ప్రమాణాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ ఈ పథకాన్ని వర్తింపజేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

### గతంలో ఏపీలో చంద్రన్న బీమా

గతంలో ఏపీలో చంద్రన్న బీమా అనే పథకం అమలయ్యేది . చాలా సంతృప్త స్థాయిలో అమలయింది. చనిపోయిన వారి కుటుంబానికి మట్టి ఖర్చులకు అప్పటికప్పుడు డబ్బులు ఇచ్చేవారు. అయితే చంద్రబాబు ఓడిపోవడంతో ఆ పథకం అటకెక్కింది. కానీ దాని వల్ల కష్టకాలంలో సాయపడిన వారు మాత్రం మర్చిపోరు. ఇప్పుడు అదేతరహాలో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు కూడా వర్తింపజేయడం ద్వారా ప్రభుత్వం ప్రతి కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకుంటోందన్న అభిప్రాయం కల్పించాలనుకుంటోంది. అభివృద్ధి

- మిగతా 2వ పేజీలో



## జీపీల సొంత ఆదాయం బ్యాంక్

# ఖాతాలో వేయండి

### గ్రామపంచాయతీ సిబ్బందికి మొదటి తారీఖునే జీతాలు అందాలి

ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకునేది లేదు

ప్రస్తుత పెన్షన్ విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయాలి... అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సమీక్షా సమావేశం

హైదరాబాద్, మే 26 (ప్రజాతీర్పు):

గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని (వోన్ సోర్స్ రెవెన్యూ) ట్రెజరీ ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా సవరించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు నెల నెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా అలాగే జీతాలు అందాలన్నారు. సిబ్బంది జీతాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకునేది లేదని వారిని హెచ్చరించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో

- మిగతా 2వ పేజీలో

# మీ చేతుల్లోనే జీహెచ్ఎంసీ..

### వాట్సాప్‌లో కార్యాలయ సేవలు ఆఫీస్‌కు వెళ్లాల్సిన పని లేకుండానే..




(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

హైదరాబాద్‌లో బర్త్ సర్టిఫికెట్ సవరణ కోసమో లేదా ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు కోసమో ప్రభుత్వ ఆఫీస్‌ల చుట్టూ తిరగడం అంటే అగ్నిపరీక్షే. కానీ, మారుతున్న కాలంతోపాటు పాలన కూడా ప్రజల అరచేతిలోకి వచ్చేసింది. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, కమ్యూనికేషన్ల విభాగం ఆధ్వర్యంలోని మీ సేవ ప్లాట్‌ఫామ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజల కోసం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. తెలంగాణ మీ సేవ ప్లాట్‌ఫామ్ తన వాట్సాప్ చాట్‌బాట్ సేవలను మరింత విస్తరించింది. గతంలో ఉన్న సేవల కంటే అదనంగా, ఇప్పుడు తొమ్మిది కొత్త జీహెచ్ఎంసీ సేవలను ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో చేర్చారు. దీని వల్ల హైదరాబాద్ నివాసితులు తమ ఇంటి నుంచే కేవలం ఒక వాట్సాప్ మెసేజ్‌తో తమ పనులను పూర్తి చేసుకోవచ్చు. కార్యాలయాలకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండానే, నేరుగా చాట్ ఇంటర్‌ఫేస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి వీలు కలుగుతుంది.

ఆస్తి పన్ను సేవలు, పన్ను చెల్లింపులు, విచారణలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాపారస్తులు సులభంగా

- మిగతా 2వ పేజీలో



# అక్రమ వలసలకు చెక్

### అసహజ జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ

### సుప్రీం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటు

### ప్రకటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, మే 26: దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలకు చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ప్రకటించారు. ఈ సమస్య భారతదేశ సార్వభౌమత్వానికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా ఆయన అభివర్ణించారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి (విదేశీయులు-1)సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను సిఫారసు చేస్తుందని షా తెలిపారు.




# టీ–వర్క్స్‌ను తీసుకొచ్చిందే కేసీఆరే

### 'ఎక్స్'లో కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ భవిష్యత్తును ప్రపంచానికి పరిచయం చేసిన విజన్ పేరు టీ–వర్క్స్ అని... దాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చింది కేసీఆరే అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఎక్స్'లో ఆయన మంగళవారం టీ–వర్క్స్ పురోగతిపై స్పందించారు. 'కేసీఆర్ ఆలోచనల్లో పుట్టి, యువత చేతుల్లో సాంకేతిక శక్తిగా మారిన గొప్ప వేదిక ఇది. స్టార్టప్‌లకు కేవలం మాటల

- మిగతా 2వ పేజీలో

## శంషాబాద్‌లో భూం

# 170 ఎకరాలకు స్కెచ్

### ప్రభుత్వ భూమి, పట్టా ఎలా అయ్యింది?

ఆర్డీవో, తహసీల్దార్ వేర్వేరు రిపోర్టులు

ఆర్డీవోను కాదని తహసీల్దార్ ప్రైవేటు భూమి అని ఎలా డిసైడ్ చేస్తారు

ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దలు ఎవరున్నారు?

సిట్ వేసి, విచారణ జరిపించాలి

డిప్యూటీ ఫ్లోర్ లీడర్, హరీశ్‌రావు డిమాండ్




హైదరాబాద్, మే 26 : శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే కుట్ర జరిగిందని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఆ భూమి ప్రభుత్వ

- మిగతా 2వ పేజీలో

(మొదటి పేజీ తరువాయి)

# జీపీల సొంత ఆదాయం బ్యాంక్ ఖాతాలో వేయండి

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీ, ఆర్థికశాఖల అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి పెన్షన్ల పంపిణీ విధానంపై కీలక ఆదేశాలిచ్చారు. ప్రస్తుత పెన్షన్ విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని సూచించారు. అర్హులకే చేయూత పింఛన్లు అందేలా చూడాలని స్పష్టంచేశారు. ఓటర్ ఐడీ, ఆధార్, కులగణన (సీప్‌సీ డేటా) ఆధారంగా పెన్షన్లను స్ట్రీమ్ లైన్ చేయాలని ఆదేశించారు. కొత్తగా అందించే పెన్షన్లలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సీఎం సూచించారు. కాగా సొంత ఆదాయంపై గ్రామపంచాయతీల స్వతంత్రతకు భంగం కలిగించేలా గత ప్రభుత్వం నిబంధనను తొలగించిందని, ఇప్పుడు దానిని పునరుద్ధరించేందుకు సీఎం అంగీకారం తెలిపారు. దీనికి అనుగుణంగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి గవర్నర్‌కు పంపిస్తే ఆయన ఆమోదం తర్వాత ఇది అమల్లోకి రానుంది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేనందున ఈ మేరకు ఆర్డినెన్స్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత శాసనసభ సమావేశాల సమయంలో దీనిపై చట్ట సవరణ బిల్లు పెట్టి ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తాజాగా సీఎం ఆదేశాలతో జీపీల సొంత ఆదాయాన్ని (వోన్ సోర్స్ రెవెన్యూ)బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా పీఆర్‌ఆర్‌డీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సమీక్షా సమావేశంలో పీఆర్ ఆర్‌డీమంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, స్పెషల్ సీఎస్ దానకిషోర్, కమిషనర్ దివ్యాదేవరాజన్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

## మీ చేతుల్లోనే జీహెచ్‌ఎంసీ..

తమ లైసెన్స్‌లను అప్‌డేట్? చేసుకోవచ్చు. పేర్లు లేదా ఇతర వివరాలు జనన ధృవీకరణ పత్రాల్లో సవరణలు ఉంటే సరిదిద్దుకోవచ్చు. ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ చేసుకోవచ్చు. పేరు మార్పు, సవరణ, ఇంటి వద్ద జరిగిన జననాల నమోదు, ఇంటి వద్ద జరిగిన మరణాల నమోదు, ఇతర పౌర సేవలు ఇందులో పొందవచ్చు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పౌర సేవలను డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టింది. ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్, వాట్సాప్ అందుబాటులో ఉన్నాయి. ఇతర యాప్‌లు డోన్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా నేరుగా పని పూర్తి అవుతుంది. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే శ్రమ, రవాణా ఖర్చులు తప్పుతాయి. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రభుత్వం నుంచే సేవలు పొందవచ్చు. గత ఏడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ వాట్సాప్ ఛానెల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆదాయ ధృవీకరణ పత్రాలు, పోలీసు చాలనాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రజలు దీనిని విరివిగా వాడుతున్నారు. మీసేవ వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవడం చాలా సులభం. దీని కోసం మీరు ఫాలో చేయాల్సిన స్టెప్స్ ఉన్నాయి ముందుగా మీరు 8096958096 నెంబర్‌ను సేవ్ చేసి పెట్టుకోవాలి. వాట్సాప్‌లోకి వెళ్లి ఈ నెంబర్‌కు హాయ్, హాలో అని మెసేజ్ చేయాలి. మీరు మెసేజ్ పంపగానే చాట్‌బాట్ స్పందిస్తుంది. స్క్రీన్‌పై కనిపించే ప్రాంప్ట్‌లను అనుసరిస్తూ మీకు కావాల్సిన సేవను ఎంచుకోండి. ఒక వేళ ఆ సేవకు ఫీజు ఉంటే అక్కడే ఉన్న లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేమెంట్ పూర్తి చేయవచ్చు.

## కుటుంబాలకు రేవంత్ అండ

## బలహీనవర్గాలకు భీమా

చెందిన దేశాల్లో కూడా లేని విధంగా ప్రతి కుటుంబానికీ వర్తించే యూనివర్సల్ లైఫ్ ఇన్సూరెన్స్ ను అమలు చేయడం ద్వారా తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. రైతు బీమా, నేతన్న బీమా తరహాలోనే ఇది ప్రతి సామాన్య కుటుంబానికి ధీమా ఇవ్వనుంది. ఈ పథకం అమలులోకి వస్తే, తెలంగాణ సామాజిక భద్రతా రంగంలో ఒక గేమ్ ఛేంజర్‌గా మారుతుందనడంలో సందేహం లేదు.

### ప్రజలగుండెల్లో స్థానం..

సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల గుండెల్లో స్థానాన్ని పదిల పరచుకుంటోంది. ముఖ్యంగా అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ముందుకు సాగుతుండటం చూస్తుంటే వచ్చే ఎన్నికల్లో సైతం పార్టీకి తిరుగులేదన్న భావన వ్యక్తమవుతోంది. మొత్తంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల్లో మంచి అభిప్రాయాన్ని సంపాదించుకుంటున్నారు.

## టీ-వర్క్స్‌ను తీసుకొచ్చిందే కేసీఆరే



ప్రోత్సాహం కాదు.. ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది నాటి భారాస ప్రభుత్వం. నేడు దేశం మొత్తం డ్రోన్లు, డిఫెన్స్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ గురించి మాట్లాడుతుండగా, తెలంగాణలో ఆ బీజం ఎన్నో ఏళ్ల క్రితమే కేసీఆర్ నాయకత్వంలో పడింది. టీ-వర్క్స్ అనేది ఒక భవనం కాదు. తెలంగాణ యువత కలలకు రెక్కలు తొడిగిన ప్రయోగశాల. మేక్ ఇన్ తెలంగాణ అనే ఆత్మవిశ్వాసానికి ప్రతీక. దేశంలోనే అతిపెద్ద ప్రొటోటైపింగ్ సెంటర్‌ను తీసుకొచ్చి.. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టిన దూరదృష్టి కేసీఆర్‌దే. ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్న ఈ సంస్థ తెలంగాణ అభివృద్ధి ఎంత ముందుచూపుతో సాగిందో మరోసారి నిరూపిస్తోంది" అని కేటీఆర్ వివరించారు.

# శంషాబాద్‌లో భూం

# 170 ఎకరాలకు స్కెచ్

(మొదటి పేజీ తరువాయి)

భూమి అని.. దాన్ని ఆక్రమణకు గురికాకుండా ఉండాలని ఆర్డీవో.. తహసీల్దార్‌కు చెప్పారు. అంతేకాదు ప్రొహిబిటరీ లిస్టు 22ఏలో పెట్టాలని ఆదేశించారు. ఇదే విషయం జనవరి 30, 2026 నాడు హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో పొందుపరిచారు. ఇది ప్రభుత్వ భూమి అని ఫిబ్రవరి 24, 2026 నాడు తహశీల్దార్ తేల్చారు. నాలుగు రోజుల తర్వాత ఫిబ్రవరి 28, 2026 నాడు ఈ భూమి ప్రైవే టు వ్యక్తులకు చెందుతుందని తహశీల్దార్ ఆర్డ ర్ పాస్ చేసిండు. ఈ నాలుగు రోజుల్లోనే ప్రభుత్వ భూమి ప్రైవేటు భూమి ఎలా అయ్యింది' అని హరీష్‌రావు నిలదీశారు. అం తే కాదు ఈ భూమిని భూ భారతి ఆన్‌లైన్‌లో కూడా పెట్టారని తెలిపారు. 'ఆర్డీవో, తహశీల్దా ర్ ఇద్దరు భిన్నంగా ఇస్తే జీపీ రెవెన్యూ హైకోర్టుకు ఎలా ఇచ్చారు. ఏ ఆర్డర్ అయినా కలెక్టర్ అప్రూవల్‌తో హైకోర్టుకు వెళ్తుంది, కలెక్టర్ ఎలా అప్రూవల్ చేసారు. అడ్వకేట్ జనరల్ ఏరకంగా అప్రూవల్ చేసారు. రూ.వెయ్యి కోట్ల విలువైన భూములు. ఇంత పెద్ద స్కాం జరిగితే అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఈ స్కాం గురించి పత్రికల్లో వస్తే, ఈ కేసులో కేవలం ఎమ్మార్వోను కలెక్టరేట్‌కు బదిలీచేసి ఊరుకున్నరు. ఏసీబీ అధికారులు రైడ్ వెళ్లారు. ప్రభుత్వ పెద్దలు ఏం చెప్పారో ఏసీబీ వాపస్ వచ్చింది. తహసీల్దార్‌ను చిన్న బదిలీతో సరిపెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి సంబం ధించిన అతి సన్నిహితుడు ఇందులో ఉన్నడు కాబట్టే ఏసీబీ వెనక్కి వచ్చింది. ఒత్తిడి కారణంగానే ఎమ్మార్వోను జస్ట్ ట్రాన్ఫర్ చేసారు. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎమ్మార్వో



ను కాపాడటంలో ఉన్న పెద్దలు ఎవరు? వారు బయటకు రావాలి' అని హరీష్‌రావు డిమాం డ్ చేశారు. భూ భారతిలో భూమి చేరాలంటే.. దరఖాస్తు పెట్టాలి, ఆర్డీవో దాన్ని అప్రూవ్ చేయాలని భూభారతి చట్టం చెబుతుందని, కానీ ఎమ్మార్వో భూ భారతిలో పెట్టాలని చెప్పగానే అది భూ భారతిలో ఎంట్రీ అయిపోయిం ది' అని హరీష్‌రావు చెప్పారు. 170 ఎకరాలు ప్రభుత్వ భూమి పట్టా అని ఎలా ఎక్కించారని ఆయన మండిపడ్డారు. ఎమ్మార్వోను కేవలం ట్రాన్ఫర్ చేసి భూమి మ్యుటేషన్ చేసుకున్నారని, ఆ భూమిని ఎందుకు తీసుకోలేదని, నిషే ధిత జాబితాలో ఎందుకు చేర్చలేదని, టోటల్ పట్టా భూమిగా 170 ఎకరాలు మార్చుకున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఎమ్మార్వో ను సస్పెండ్ చేసి సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైకోర్టు ఆర్డర్ మీద ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లి.. ఆ భూమిని తిరిగి నిషేధిత జాబితాలో పెట్టాలన్నారు'. ఈ విషయంలో కలెక్టర్, సీసీఎల్ఏ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారా? ఆరా తీయాలని, ప్రభుత్వ పెద్దలు కూడా బయటకు రావాలన్నారు. మీది నిజంగా ప్రజాపాలన అయితే, ఈ భూ కుంభకోణంలో భాగస్వామ్యం లేకపోతే, తప్పు చేయకపోతే మీ ప్రమేయం లేకపోతే తహశీల్దార్‌ను వెంటనే డిస్మిస్ చేయండి, ప్రభుత్వ భూమిని కాపాడండి' అని హరీష్‌రావు కోరారు.

### ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్‌ను ఎత్తివేయాలి

జగిత్యాలలో ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై సస్పెన్షన్ వేటువేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మని హరీష్‌రావు అన్నారు. ఆయన డ్రైవర్ కావొచ్చు, ఒక వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన బిడ్డ అని, రైతుల కష్టాలు చూడలేక ధాన్యం కొనుగోలు చేయాలని మాట్లాడితే తప్పు ఎలా అవుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందని, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాలరా స్తారా? అని హరీష్‌రావు మండిపడ్డారు. ప్రశ్నించే హక్కు ఆరో గ్యారెంటీ అన్న మీకు.. ఇంత నియంతృత్వ వైఖరి ఎందుకని, సస్పెన్షన్ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌కు అండగా బీఆర్ఎస్ ఉంటుందని, న్యాయపోరాటం, ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమన్నారు.



# సీఎం, మంత్రుల ఇళ్ల ముందు ధాన్యం డంప్ చేస్తాం

## వారం రోజుల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాల్సిందే

### ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల హెచ్చరిక

యాదాద్రి/జనగామ/ఆత్మకూరు: రాష్ట్ర వ్యాప్తంగా మరో వారం రోజుల్లో ధాన్యం వందశాతం కొనుగోళ్లు, లిఫ్టింగ్ చేయని పక్షంలో ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మంత్రులు, సీఎం ఇళ్ల ముందు, అలాగే సచివాలయానికి తీసుకెళ్లి అన్‌లోడ్ చేస్తామని బీజేపీ ప్రతినిధుల బృందం హెచ్చరించింది. రైతుల పక్షాన మాట్లాడినందుకు ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్ చేయడం కాదు.. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తమను సస్పెండ్ చేసి ఎన్నికలకు వచ్చే దమ్ముందా? అని సవాల్ విసిరింది. రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ఆర్మూర్, కామారెడ్డి ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డిల బృందం మంగళవారం జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధి కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకేపీ, మెప్మా ధాన్యం కొనుగోలు సెంటర్‌ను, హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుల్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించింది. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు, భువనగిరి మండలం వడపర్తిలోని ఐకేపీ కేంద్రాన్ని బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రైతులతో మాట్లాడి వారు పడుతున్న బాధలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలు పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మొత్తం 1.40 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా, ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు చేసింది కేవలం 45 వేల మెట్రిక్ టన్నులు మాత్రమేనని మహేశ్వర్‌రెడ్డి వివరించారు. ఈ లెక్కలు చూస్తే 80 శాతం పూర్తయిందని సీఎం చెప్పే పరిస్థితి ఏమాత్రం లేదని, 30 శాతం కొనుగోలు కూడా జరగలేదన్న వాస్తవం బయటపడుతోందన్నారు. ప్రతి కల్లం నుంచి పోయే ధాన్యం బస్తాల్లో 10 శాతం 'కటింగ్'పేరుతో జరుగుతున్న భారీ దోపిడీపై మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ 10 శాతం లెక్కిస్తే మొత్తం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి అదృశ్యమవుతోందని, దాని విలువ సుమారు రూ.2 వేల160 కోట్లకు పైమాట అవుతుందని ఆయన తెలిపారు. రైతుల సమస్యలపై బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కల్లాల బాట పట్టడంతోనే ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. నిన్న గజ్వేల్‌కు బీజేపీ బృందం వెళ్లడంతో కలెక్టర్ స్వయంగా వచ్చి 30 లారీలను ఏర్పాటు చేశారని, ఇవాళ భువనగిరి కేంద్రానికి వస్తున్నామని తెలియగానే లారీలు వస్తున్నాయని చెప్పారు. ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ రైతుల పక్షాన మాట్లాడినందుకు కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. బీజేపీ ప్రతినిధి బృందంలో భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, గూడూరు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.



# ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ తొలగింపుపై వివాదం

## మంత్రుల జోక్యంతో తిరిగి విధుల్లోకి

జగిత్యాల,: ఆర్టీసీ జగిత్యాల డిపోలో అద్దె బస్సు డ్రైవర్ తొలగింపు వివాదాస్పదమైంది. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సోమవారం జగిత్యాల ఆర్డీవో కార్యాలయ చౌరస్తాలో కాంగ్రెస్ నిరసన చేపట్టగా.. అదే సమయంలో అటువైపు వచ్చిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ బి.అశోక్ 'ముందు వడ్లు, మక్కలు కొనండి.. పెట్రోల్, డీజిల్ ధరల సంగతి తర్వాత' అంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీనిపై ఓ కాంగ్రెస్ నాయకుడు ఫిర్యాదు చేయడం.. మంగళవారం జగిత్యాల డిపో మేనేజర్ బస్సు యజమానికి లేఖ రాయడంతో డ్రైవర్‌ను తొలగించారు. 'నేను ప్రభుత్వాన్ని విమర్శించలేదు. ధర్నా ఎందుకు చేస్తున్నారని అక్కడే ఉన్న మా గ్రామస్థుడిని అడిగాను. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు గురించి అని చెబితే ముందుగా వడ్లు, మక్కల సంగతి చూడండి అని సూచించాను' అని అశోక్ మీడియాతో వాపోయారు. చివరికి అది రాజకీయ అంశంగా మారి పలువురు భారాస, భాజపా నాయకులు అతడికి అండగా నిలిచారు. డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని పట్టుబట్టారు. దీంతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్ మాటలను స్వాగతిస్తున్నామని, అతడిని విధుల్లోంచి తొలగించవద్దని బస్సు యజమానికి సూచించామన్నారు. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డ్రైవర్ అశోక్ చేసిన వ్యాఖ్యల్లో తప్పేమీ లేదని, కేంద్రం నిర్ణయాల ఫలితంగా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారుల సమావేశం అనంతరం డ్రైవర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు.

# మావోయిస్టు అగ్రనేత నరహరి లొంగుబాటు

## ఇక దేశంలో మిగిలింది 47 మంది మాత్రమే

## లొంగిపోయిన వారి ఉపాధికి స్కిల్లింగ్ సెంటర్

## గణపతి దేశంలోనే ఎక్కడో రహస్య జీవితం గడుపుతున్నారు.. డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి



హైదరాబాద్: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, బిహార్-ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ(బీజేసాక్) కార్యదర్శి పసునూరి నరహరి ఎలియాస్ విశ్వనాథ్(64) జనజీవన స్రవంతిలో కలిసినట్లు డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. నరహరితోపాటు ఆయన భార్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మేదర దానమ్మ ఎలియాస్ జోబా ఎలియాస్ పూనం(55) సైతం అజ్ఞాతం వీడినట్లు వెల్లడించారు. వీరిద్దరి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీకి మిగిలి ఉన్న ఏకైక తూర్పు ప్రాంతీయ బ్యూరో(ఈఆర్‌బీ) పతనం అంచుకు చేరుకుందన్నారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను డీజీపీ వెల్లడించారు. నరహరిపై ఉన్న రూ.25 లక్షల రివార్డును, దానమ్మ పేరిట ఉన్న రూ.20 లక్షల రివార్డులను చెక్కుల రూపంలో అందజేశారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ... "పార్టీకి అస్తిత్వం లేదని భావించి నరహరి దంపతులు అజ్ఞాతం వీడారు. తీవ్ర అనారోగ్యంతో 15 రోజుల క్రితమే మావద్దకు రావడంతో చికిత్స అందించాం. తెలంగాణలో 2024 నుంచి 822 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పోలీసుల కృషితోపాటు ప్రభుత్వ పునరావాసంపై పెరుగుతున్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. లొంగిపోయిన వారిలో నైపుణ్యాల్ని వెలికితీసి ఉపాధి కల్పించడం ద్వారా వారిని సమాజంలో మమేకం చేసేందుకు స్కిల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రస్తుతం తెలంగాణ నుంచి గణపతితోపాటు ఆయన భార్య, జోడె రత్నాబాయి ఎలియాస్ సుజాత, వార్తశేఖర్ ఎలియాస్ మంగ్తూ మాత్రమే పార్టీలో ఉన్నారు. గణపతి దేశంలోనే ఎక్కడో రహస్య జీవితం గడుపుతున్నట్లు సమాచారముంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో దేశవ్యాప్తంగా 47 మాత్రమే మిగిలారు. ఎవరు లొంగిపోయినా పునరావాసం కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు.

### రాకెట్లు.. బూబీట్రాప్‌ల తయారీలో నిపుణుడు

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడికి చెందిన నరహరి వరంగల్ ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగానే ఆర్ఎస్‌యూ కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. 1982లో అప్పటి పీపుల్స్‌వార్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి పులి అంజయ్య ప్రేరణతో పార్టీలో చేరారు. తొలుత సుక్మా జిల్లా కుంట దళంలో చేరిన నరహరి... 1986-88 మధ్య హైదరాబాద్ సిటీ ఆర్గనైజర్‌గా, బెంగళూరులో డెన్‌కీపర్‌గా, 1990-97 మధ్య దండకారణ్యంలో దక్షిణబస్తర్ సాంకేతిక విభాగంలో పనిచేశారు. 2000-04 మధ్య కేంద్ర సాంకేతిక కమిటీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఈక్రమంలో తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, గ్రనేడ్లు, బూబీట్రాప్(ఉచ్చు)ల తయారీలో నైపుణ్యం సంపాదించారు. ఆయుధాల ఉత్పత్తి, మరమ్మతులపై పార్టీ క్యాడర్‌కు శిక్షణ ఇచ్చారు. 2006 నుంచి బీజేసాక్ కార్యకలాపాల్ని పర్యవేక్షిస్తూ 2017లో కేంద్రకమిటీకి ఎంపికయ్యారు. ప్రస్తుతం బీజేసాక్ కార్యదర్శిగా పనిచేస్తూ అజ్ఞాతం వీడారు. "ప్రస్తుతం మిగిలి ఉన్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మిసిర్‌బెస్రా అనుమతితోనే అజ్ఞాతం వీడాం. లొంగుబాట్లకు తెలంగాణ ప్రభుత్వ విధానం అనుకూలంగా ఉంది. గణపతి, మిసిర్‌బెస్రాలు ఇక్కడికి వచ్చి జనజీవన స్రవంతిలో కలవాలి" అని నరహరి ఈ సందర్భంగా విన్నవించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడుకు చెందిన దానమ్మ 1986-88 కాలంలో అదే ప్రాంతంలో పార్టీ ఆర్గనైజర్‌గా పనిచేశారు. 1988లో నరహరిని వివాహం చేసుకున్నాక భర్తతోపాటు బెంగళూరులో డెన్‌కీపర్‌గా వ్యవహరించారు. 1992లో దక్షిణ బస్తర్ సాంకేతిక విభాగంలో పనిచేశారు. 2004 డిసెంబరులో నాగ్‌పూర్‌లో అరెస్టయి... ఏడేళ్ల కారాగారవాసం అనంతరం బెయిల్‌పై విడుదలై తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లారు.



## మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

### జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 25**

మహిళ సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా వారోత్సవాలలో పోషకాహార అవగాహన, ఎగ్జిబిషన్ కార్యక్రమాలకు జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మహిళలు, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అలవరుచుకోవాలని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో స్థానికంగా లభ్యమయ్యే తక్కువ ఖర్చుతో కూడిన పౌష్టికాహార పదార్థాలు, మిల్లెట్స్ ఆధారిత ఆహార పదార్థాలు, పోషకాహార వంటకాలు ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు గర్భధారణ సమయంలో తీసుకోవలసిన పౌష్టికాహారం, రక్తహీనత నివారణ, సమతుల్య ఆహారం, ఆహార వైవిధ్యం, జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఆరోగ్య శాఖ సమన్వయంతో గర్భిణీ స్త్రీలకు అనీమియా పరీక్షలు నిర్వహించి పాటించవలసిన జాగ్రత్తలను వివరించడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై కమ్యూనిటీ న్యూట్రిషన్ ప్రతిజ్ఞ చేయించారు. తల్లితండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో పౌష్టికాహార వంటకాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.



## నూతనంగా ఎంఎంసీసీ క్రికెట్ అకాడమీనీ ప్రారంభించిన ఎసిపి కిరణ్ కుమార్

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 25**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని సుబ్బారావుపల్లి లో నూతన ఎం,ఎం,సి,సి, క్రికెట్ అకాడమీ ని ప్రారంభించిన బెల్లంపల్లి పట్టణం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ కిరణ్ కుమార్ ఈ కార్యక్రమం లో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మెన్ శ్రీమతి దావా స్వాతి రమేష్. కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరీ స్వామి, బెల్లంపల్లి పట్టణం కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్, వార్డు కౌన్సిలర్లు గాలి లత శ్రీనివాస్, నాయకులు డికొండ రాజలింగు, కంకటి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం ఎం సి సి,క్రికెట్ అకాడమీ అధ్యక్షుడు నాతరి స్వామి, మాట్లాడుతూ భవిషత్ లో బెల్లంపల్లి నియోజక వర్గం నుండి జాతీయ స్థాయిలో పాల్గొనేలాగా తయారు చేస్తాం అని తెలియజేశారు నియోజక వర్గం క్రీడా అభివృద్ధి లో బెల్లంపల్లి,ఎం ఎం సి సి,క్రికెట్ అకాడమీ ముందుంజ లో ఉంటుంది అని తెలియజేశారు,ఏసీపీ మాట్లాడుతూ పిల్లలు మత్తు పానీయాల కు దూరం ఉంటూ క్రీడలో రాణించాలి అని తెలియజేశారు.



## భైంసా బ్రిడ్జిపై డబుల్ ట్రాలీ ట్రాక్టర్ బోల్తాతృటిలో తప్పిన ఘోర ప్రమాదం

**(కపిల్ వాగ్మారే సీ ఆర్క్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 26**

కామోల్ గ్రామం నుండి మాటేగాం గోదాం వైపు మక్కా జొన్నలతో వెళ్తున్న డబుల్ ట్రాలీ ట్రాక్టర్ భైంసా బ్రిడ్జి పై అదుపుతప్పి బోల్తా పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.తృటిలో పెద్ద ప్రమాదం తప్పడంతో ప్రజలు,ఊపిరిపీల్చుకున్నారు.ఈప్రమాదం కారణంగా బ్రిడ్జి పై రెండు నుండి మూడు గంటల పాటు భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే టౌన్ ఎస్ఐ నవనీత్ రెడ్డి గారు, సెవెంత్ బెటాలియన్ శ్రీనివాస్, మరియు పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. భారీగా రోడ్డుపై చెల్లాచెదురైన మక్కా జొన్నలను తొలగించి, ట్రాక్టర్‌ను పక్కకు తరలించి రాకపోకలను పునరుద్ధరించారు.ఈ ఘటన మరోసారి భారీ లోడ్లతో నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ఎంత ప్రమాదకరమో గుర్తుచేసింది. ముఖ్యంగా బ్రిడ్జిలపై మరియు రద్దీ,ప్రాంతాల్లోవాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## జిల్లాలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు

### మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు.

**ఎల్లారెడ్డిపేట, మే 26 (ప్రజా తీర్పు)**



ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఈరోజు పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

# లింగాపూర్ గ్రామంలో ఇద్దరు వ్యక్తుల వద్ద నుండి 25 లీటర్ల గుడుంబా స్వాధీనం

### బెల్లంపల్లి రూరల్ పోలీసులు

**(వి,వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 26**



మంగళవారం తెల్లవారు జామున మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భూక్య రంజిత్, నివాసం లింగాపూర్, తన ఇంటి వద్ద అక్రమంగా కలిగి ఉన్న 20 లీటర్ల గుడుంబాను మరియు బానోత్ వాగేష్, నివాసం లింగాపూర్, తన ఇంటి వద్ద అక్రమంగా కలిగి ఉన్న 05 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సుమారు 1200 లీటర్ల గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకం మరియు ఇతర సామగ్రిని ధ్వంసం చేసుకోవడం జరిగింది.అలాగే 30 మోటార్ సైకిళ్లు, 5 ఆటోలు,మరియు 4 ట్రాలీల,వాహన పత్రాలను తనిఖీ చేసి, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించడం జరిగింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్, ప్రజలతో మాట్లాడుతూ గుడుంబా తయారీ, నిల్వ మరియు విక్రయం చట్టవిరుద్ధమని తెలియజేశారు. గుడుంబా సేవించడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వివరించారు. ఎవరైనా గుడుంబా తయారు చేసినా, నిల్వ ఉంచినా లేదా విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం, ట్రాఫిక్ నియమాలు మరియు హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి టూ టౌన్ ఎస్.ఐ కిరణ్ కుమార్, తాళ్ళగురిజాల ఎస్.ఐ రామకృష్ణ, ఏ.ఎస్.ఐ అలీ, ఏ.ఎస్.ఐ తిరుపతి మరియు బెల్లంపల్లి రూరల్ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేసి లబ్ధులు పొందుతున్న భూస్వాములు భూమిలేని పేదలకు ఎప్పుడు న్యాయం

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 26**



భైంసా మండలం వాలేగాం గ్రామంలో సుమారు 40 నిరుపేద కుటుంబాలు భూములు లేక కూలి పనులు చేసుకుంటూ అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నాయి. ప్రభుత్వం భూమిలేని పేదల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను గ్రామంలోని ఇప్పటికే భూములు కలిగిన కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి పట్టాలు పొందినట్లు బాధిత కుటుంబాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ముఖ్యంగా 121 సర్వే నంబర్ నుండి 131 సర్వే నంబర్ వరకు ఉన్న ప్రభుత్వ భూములను ప్రభావశీలులు తమ పేర్లపై అక్రమంగా పట్టాలు చేసుకుని, అదే భూముల ఆధారంగా రుణమాఫీ, క్రాప్ లోన్లు మరియు ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధులను పొందుతున్నారని వాపోతున్నారు.ఇక అసలు అర్హులైన భూమిలేని నిరుపేదలు మాత్రం నేటికీ కూలి పనులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ భూములు పేదలకు అందాల్సి ఉండగా, అధికారుల నిర్లక్ష్యం మరియు కొందరి ప్రభావం వల్ల నిజమైన లబ్ధిదారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అన్యాయంపై స్పందించాలని కోరుతూ 09-12-2024 తేదీన సోమవారం నిర్వహించిన ప్రజావాణి/గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అనంతరం ఎన్నోసార్లు ఎంఆర్వో కార్యాలయం చుట్టూ తిరుగుతూ, ఎంఆర్వో ప్రవీణ్ కుమార్ గారు మరియు ఆర్డీవో గారిని వ్యక్తిగతంగా కలిసి సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. న్యాయం కోసం నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారుల నుండి సరైన స్పందన లేకపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్రమంగా పొందిన పట్టాలను వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ భూములను నిజమైన అర్హులైన భూమిలేని నిరుపేద కుటుంబాలకు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ వినతిపత్రంపై బిరోల్లా నవీన్, సార్ల అరుణ్, సదొల్ల సంజు, గణబాయి, రాధాబాయి తదితరులు సంతకాలు చేశారు.







## ఆర్ అండ్ బి ప్రదర్శన బోర్డులలో... వ్యత్యాసం

### గార్ల. "డోర్నకల్ మండల కేంద్రం" దూరంలో నమోదు తేడాను గుర్తించి మార్చాలి

**(పగడాల రామారావు ప్రజా తీర్పు. గార్ల మండల ప్రతినిధి.) మే 26**

గార్ల.. మండల కేంద్రంలో ఆర్ అండ్ బి ఏర్పాటుచేసిన ప్రదర్శన బోర్డులలో డోర్నకల్ మండల కేంద్రం దూరం నమోదులో తేడాను గుర్తించి మార్చాలని వాహనదారులు కోరుచున్నారు. స్థానిక పట్టణ కేంద్రం వర్తక సంఘం మార్గం వద్ద ఆర్ అండ్ బి ఏర్పాటుచేసిన ప్రదర్శన బోర్డులో "డోర్నకల్"మండల కేంద్రం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు నమోదు చేయబడినది. అదే బజారులో జం,జం బేకరీ మలుపు టర్నింగ్ వద్ద ఆర్ అండ్ బి అధికారులు ఏర్పాటు చేసిన ప్రదర్శన బోర్డులో డోర్నకల్ మండల కేంద్రం 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు నమోదులో తేడా రాశారు. ఒకే బజారులో ఏర్పాటు చేసిన ప్రదర్శన బోర్డులలో తేడా ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు? ఆర్ అండ్ బి శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శన బోర్డులలో నమోదు చేసిన తేడాను గుర్తించి, సరిచేయాలని పాదాచారులు, వాహనదారులు, ప్రజలు కోరుచున్నారు.

## కులం, మతం, రాజకీయం..

# బలి అవుతున్న సామాన్యుడు!

భారతదేశం వేల సంవత్సరాల మహోజ్వల చరిత్ర కలిగిన అద్భుత నాగరికత. ఇక్కడ వందలాది భాషలు, అనేక మతాలు, విభిన్న సంప్రదాయాలు ఒకే తోటలోని రంగురంగుల పూలలా కలిసి పుష్పిస్తాయి. కానీ, ఈ అపారమైన వైవిధ్యమే మన అసలైన శక్తి అని గుర్తించవలసిన నేతలు, నేడు దానినే తమ స్వార్థ రాజకీయ వేదికగా మార్చుకుంటున్నారు. ప్రజలను మానసికంగా విభజించడంలో వారు అత్యంత నిపుణులయ్యారు. విభజించు పాలించు అనే బ్రిటిష్ వలస పాలనా విధానం ఇప్పటికీ మన స్వతంత్ర భారత రాజకీయ రంగస్థలంపై మహోగ్రంగా పనిచేస్తూనే ఉంది. కాలం మారింది, కానీ కుట్ర మారలేదు. తేడా కేవలం ఒక్కటే అప్పుడు పరాయి విదేశీయులు మనల్ని విభజించి దోచుకున్నారు, ఇప్పుడు మన మధ్య నుంచే ఓట్లు వేసి గెలిపించుకున్న మన స్వదేశీ నేతలు మనల్ని ముక్కలు ముక్కలుగా విరగ్గొడుతున్నారు. ఇక్కడ మనం ఒక సరళమైన, ప్రాథమికమైన ప్రశ్న అడగాలి ఒకవేళ సామాన్య ప్రజలంతా ఒక్కటైతే ఏమవుతుంది? అలా జరిగితే ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా మారతాయి. అవినీతి సామ్రాజ్యాలు కుప్పకూలుతాయి. సామాజిక అన్యాయం తలెత్తడానికి సాహసించదు. అందుకే నేటి రాజకీయ నాయకులకు అత్యంత భయంకరమైన, నిద్రలేని రాత్రులను మిగిల్చే దృశ్యం ఏదైనా ఉంటే అది కులమతాలకు అతీతంగా ఏకమైన ప్రజల సమూహం మాత్రమే. కులం, మతం, ప్రాంతం, భాష పేరిట పౌరులను నిరంతరం విభజించడమే వారి తెరవెనుక అసలైన అజెండా. ఎందుకంటే మానసికంగా విడిపోయిన ప్రజలు ఎప్పటికీ సంఘటితంగా నిలబడి హక్కులను అడగలేరు.కులం అనేది భారతీయ సామాజిక నిర్మాణంలో శతాబ్దాలుగా వేళ్ళుజుర్ఝుఎశ్రీఅంఫ్ర చేసుకున్న ఒక సంక్లిష్ట వ్యవస్థ. దాన్ని రాత్రికి రాత్రే రద్దు చేయడం సాధ్యం కాదు, దాన్ని సమూలంగా పరిష్కరించడం నిజంగా కష్టం. కానీ, దాన్ని ఓట్ల లాభం కోసం వాడుకోవడం మాత్రం చాలా సులభం. ఎన్నికలు దగ్గర పడే సరికి మన నాయకులు హఠాత్తుగా కులగణాలు లెక్కపెట్టడం ప్రారంభిస్తారు. ఆయా కులాల ఆత్మగౌరవాన్ని, సెంటిమెంట్లను రగిలిస్తారు. మా వారికి మేమే అండగా ఉండకపోతే ఇంకెవరు ఉంటారు? అని సభల్లో ఉద్రేకపరుస్తారు. కానీ ఐదేళ్ల పాలన ముగిసిన తర్వాత? ఆ నేత తన సొంత కులానికి చేసిన కనీస మేలు ఏమిటి? ఆ ప్రశ్నకు సమాధానం వెతికే లోపే, మళ్ళీ మరో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తుంది.తెలుగు రాష్ట్రాల అంతటా చూస్తే ఈ నగ్న సత్యం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక నాయకుడు



ఒక కులం వారిని నమ్మించి అధికారం పొందుతాడు. మరొక నాయకుడు మరో వర్గాన్ని రెచ్చగొట్టి ఓటు బ్యాంకు నిర్మించుకుంటాడు. ఈ నిరంతర ప్రక్రియలో నిజంగా వెనుకబడిన ఆయా కులాలు అభివృద్ధి చెందడం లేదు కేవలం ఆయా రాజకీయ నాయకుల ఆస్తులు, సంపద మాత్రమే కోట్లకు పడగలెత్తుతున్నాయి. తెలంగాణలో అయినా, ఆంధ్రప్రదేశ్‌లో అయినా, దేశవ్యాప్తంగా అయినా ఈ దోపిడీ నమూనా అస్సలు మారడం లేదు. ప్రతి ఐదేళ్ళకూ ఒకసారి సామాన్యులు తమ పాత వ్యధలను మర్చిపోయి, కొత్త కులతత్వ నినాదాలకు ఆకర్షితులై ఓట్లు వేస్తున్నారు. ఆ తర్వాత మళ్ళీ అదే విచారం, అదే నిరాశ పలకరిస్తాయి.మతం అనేది ప్రతి ఒక్కరి అంతరంగిక జీవనపు పునాది. దేవుని మీద నమ్మకం, ఆధ్యాత్మిక అన్వేషణ ఇవి ప్రతి మానవుని ప్రాథమిక హక్కు. కానీ, ఈ పవిత్రమైన అనుభూతిని అసహ్యకరమైన రాజకీయ వేదికగా మార్చడం మహాపాపం. అయినప్పటికీ ఈ పాపం నిత్యం మన కళ్లముందే జరుగుతూనే ఉంది. మన మతానికి, మన సంస్కృతికి ప్రమాదం వస్తోంది అనే అరుపులు వినపడిన వెంటనే, సమాజం క్షణాల్లో రెండు పరస్పర విరుద్ధ శిబిరాలుగా విడిపోతుంది. ఇరు వైపులా అకారణ భయం, క్రోధం, అవిశ్వాసం పేరుకుపోతాయి.ఈ కలుషిత వాతావరణంలో ఏ రాజకీయ నేత ఏ అవినీతి అజెండాను అమలుపరచుకున్నా దానిని ఎవరూ ప్రశ్నించలేరు. ఎందుకంటే పాలకులను నిలదీసే ధైర్యం చేసిన వారిని వెంటనే మత వ్యతిరేకి గా లేదా దేశద్రోహి గా ముద్రవేసే ప్రమాదం ఉంటుంది. ఈ భయాందోళనలే రాజకీయ నాయకుల అత్యంత శక్తివంతమైన రక్షణ కవచాలు. హిందూ-ముస్లిం, అగ్రవర్ణ-నిమ్నవర్గం, మెజారిటీ-మైనారిటీ ఈ విభజనలు అన్నీ నిజమైన ప్రజా సమస్యలపై దృష్టి మళ్ళించేందుకు సృష్టించిన రంగుల తెరలు మాత్రమే. యువతకు ఉద్యోగాలు రావడం లేదు అనే ప్రధాన సమస్యపై చర్చ జరగకూడదంటే? వెంటనే ఏదో ఒక మతపరమైన ఘర్షణ రగిలిస్తారు. రైతులు అప్పుల్లో మునిగిపోతున్నారు అనే విషయం వెలుగులోకి రాకూడదంటే? అస్తిత్వ సంక్షోభం సృష్టిస్తారు. ఇది శతాబ్దాల నాటి పాత తంత్రం.తెలుగు ప్రజలకు ఈ ప్రాంతీయ విద్వేషాల ప్రభావం చాలా బాగా తెలుసు. రాష్ట్ర విభజన సమయంలో ఒకే భాష మాట్లాడే ప్రజల మధ్య నాయకులు అగ్నిని రగిలించారు. ఆ అగ్నిలో కాలిపోయింది మాత్రం సామాన్యుల జీవితాలే. హైదరాబాద్ వివాదం, నదీ జలాలు, ఉద్యోగాల పంపిణీ వంటి సమస్యలు ఉన్నంత కాలమే నేతలకు రాజకీయ ఆక్సిజన్ అందుతుంది.ప్రస్తుతం ఈ విభజనకు డిజిటల్ మీడియా, సోషల్ మీడియా పెద్ద వేదికలుగా మారాయి. ఫేక్ వీడియోలు, వాట్సాప్ సందేశాలు నిమిషాల్లో లక్షల మంది మనసులను విషపూరితం చేస్తున్నాయి. ఐటీ సెల్ పేరిట పని చేసే సైబర్ యోధులు నిత్యం అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. ఫలితంగా ఒకే వీధిలో ఉండే పొరుగువారు, ఒకే ఇంట్లో ఉండే కుటుంబ సభ్యులు కూడా రాజకీయాల కోసం శత్రువులుగా మారుతున్నారు.అయితే, ఈ వినాశనాన్ని ఆపే శక్తి ప్రజల చేతుల్లోనే ఉంది. విమర్శనాత్మక ఆలోచనను పెంచుకుని, నాయకులు మాట్లాడే మాటలు సమాజాన్ని ఏకం చేస్తున్నాయా లేదా విడదీస్తున్నాయా అని ప్రశ్నించాలి. ఎన్నికల్లో కులం, మతం కాకుండా పాఠశాలలు, ఆసుపత్రులు, ఉద్యోగాలు, వ్యవసాయం వంటి నిజమైన అభివృద్ధి అంశాలనే ప్రధాన అజెండాగా మార్చాలి. యువత సోషల్ మీడియాలో విద్వేషాన్ని ప్రచారం చేయడం ఆపి, తమ మనస్సాక్షి ప్రకారం ఓటు వేయాలి.ప్రజలు విడిపోతే రాజకీయాలు గెలుస్తాయి ప్రజలు ఏకమైతే ప్రజాస్వామ్యం గెలుస్తుంది. నిర్ణయం మనదే. మనం విభజించబడి ఉన్నంత కాలం రాజకీయ వ్యవస్థ పాలిస్తూనే ఉంటుంది. మనం ఐక్యమైన రోజే నిజమైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుంది.

డా .సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# జగిత్యాల జిల్లాను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడమే లక్ష్యం..

- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

నర్సింగాపూర్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం కొరకు స్థల పరిశీలన

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 26.**



మంగళవారం జగిత్యాల జిల్లాలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయం కొరకు స్థలాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన కేంద్ర విశ్వవిద్యాలయం కొరకు జగిత్యాల ఎమ్మెల్యే డా క్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ లతో కలిసి స్థల పరిశీలన చేయడం జరుగిందని అన్నారు. దానిలో భాగంగా కేంద్రీయ విద్యాలయం నిబంధనల మేరకు జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామ పరిధిలో గల వాలంతరి రైతులకు సంబంధించిన పరిశోధనలకు సంబంధించిన ప్రత్యేక వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా కేంద్రీయ విద్యాలయం కొరకు స్థలం కావాలని జిల్లా మంత్రిగా నివేదించడం జరిగిందని అన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కూడా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించడం జరిగిందని అన్నారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ శివారులోని సర్వే నెంబర్ 437లో స్థలం కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచన చేసి ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని నర్సింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం 6 ఎకరాల స్థలాన్ని సర్వే నెంబర్ 437లో కేటాయిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే రూ. 33 కోట్లతో ఐటిఐ, ఈ ఏటీసీ సెంటర్ ను ఇక్కడ ఏర్పాటు చేశామని వృద్ధ ఆశ్రమం సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని తెలిపారు. చల్ గల్ లోని వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన వాలంతరీ భూములను 12 ఎకరాలు కేంద్రీయ విద్యాలయానికి, యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కి కేటాయించడం జరిగిందని వివరించారు. కేంద్రీయ విద్యాలయానికి రెండు ఎకరాల స్థలం సరిపోదని వివాదం నేపథ్యంలో నర్సింగాపూర్ లో ప్రభుత్వ భూమి కేటాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం చల్ గల్ మరిన్ని వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన నేపథ్యంలో వ్యవసాయ పరిశోధనల భవిష్యత్తు అవసరాల కోసం అక్కడి భూములను అంతకు మించి కేటాయించే అవకాశం లేదని తెలిపారు. నర్సింగాపూర్ భూముల ప్రతిపాదనలు జిల్లా అధికారుల ద్వారా కేంద్రీయ విద్యాలయ అధికారులకు ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని ఎందుకు నిజామాబాద్ ఎంపీ అరవింద్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జగిత్యాల టి ఆర్ నగర్ నర్సింగాపూర్ శివారులో అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ దగ్గర సర్వే నంబర్ 437 లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు ఈరోజు స్థల పరిశీలన చేయడం జరిగిందని చేపట్టనున్న పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను సమగ్రంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి సమ్మర్ క్యాంపులో అవకతవకల ఆరోపణలు...

బిజెపి నాయకులు మొలుమూరి శ్రీనివాస్

**రామగిరి, మే 26 (ప్రజాతీర్పు)**

రామగిరి మండలం సెంటినరీ కాలనీలో సింగరేణి ఆర్జీ-3 ఏరియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని బిజెపి నాయకులు మరియు ఎంపిటిసిల ఫోరం మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ ఆరోపించారు. క్యాంపులో పాల్గొంటున్న పిల్లల మధ్య బేధభావాలు సృష్టిస్తూ అందరినీ సమానంగా చూడడం లేదని, ఇష్టం వచ్చిన వారికి ఒక న్యాయం, ఇష్టం లేని వారికి మరో న్యాయం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. క్రీడాకారుల శిక్షణ, పోషకాహారం కోసం సింగరేణి సంస్థ అన్ని డివిజన్లకు కలిపి రూపాయలు 15 లక్షలు కేటాయించినప్పటికి ఆ నిధులు పూర్తిస్థాయిలో పిల్లల కోసం వినియోగించడం లేదని ఆరోపించారు. ప్రతి క్రీడాకారుడికి రోజూ అందించాల్సిన డ్రెస్సులు, గుడ్లు, అరటిపండ్లు పూర్తిగా పంపిణీ చేయకుండా మధ్యలోనే మాయమవుతున్నాయని, పిల్లలకు నాసిరకం ఆహారం అందిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పిల్లల ఆరోగ్యంతో ఆటలాడుతున్న బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అందరికి ఇవ్వాల్సిన టీ-షర్టులను కొందరికే పరిమితం చేయడం వెనుక ఎవరి ఆశీస్సులు ఉన్నాయో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అధికారులకు తెలిసే ఈ దోపిడీ జరుగుతోందని, క్రీడాకారుల పేరుతో వచ్చే నిధులను కొందరు స్వాహా చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. సింగరేణి యాజమాన్యం వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు తీగల శ్రీధర్, బిజెపి సీనియర్ నాయకులు మేరుగు శ్రీకాంత్, దొంతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరు లేఖ రాసిన మందుబాబులు.. వైరల్గా మారిన వినతి పత్రం

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 26**

మద్యం ధరల పెంపు పై సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు మద్యం ప్రియుల పేరిట వినతి పత్రం రాసినట్లు ఓ లేఖ సిరిసిల్ల షోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మద్యం ధరల పెంపు పై సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కు మద్యం ప్రియుల పేరిట వినతి పత్రం రాసినట్లు ఓ లేఖ సిరిసిల్ల షోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ లేఖలో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ధరలు చలామణి అవుతున్నట్లు లేఖలో తెలిపారు. మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం మద్యం పై 20 నుంచి 30 శాతం రేట్లు పెంచే యోచనలో ఉన్నట్లు తెలిసిందని వినతి పత్రంలో పేర్కొన్నారు. మద్యం ధరలు పెంచకుండా యధావిధిగా కొనసాగించేలా ప్రభుత్వానికి కలెక్టర్ ద్వారా తెలియజేయాలని వినతి పత్రం అందజేస్తున్నట్లు అర్జీలో తెలిపారు. అయితే మందుబాబుల పేరిట రాసిన ఈ వినతిపత్రం కలెక్టర్ వరకు చేరిందో లేదో తెలియదు గాని, సోషల్ మీడియాలో మాత్రం తెగ వైరల్ అవుతుంది. కాగా మద్యం ధరల పెంపు పై కలెక్టర్ కు లేఖ రాసిన మద్యం ప్రియుల పట్ల నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## వి ఓ ఎ ల సమస్యలు పరిష్కారించాలి టి ఆర్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 26**

బెల్లంపల్లి నెన్నెల్ మండలం గత 8 రోజులుగా వి.ఓ.ఏ లు నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరం అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాంటెంకి అన్నారు. గ్రామీన ప్రాంతం అభివృద్ధికి, మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేసినా వారికీ సరైన వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం వారికీ 6000 వేతనం 5నెలలకొకసారి ఇస్తున్నారు ప్రతి పనికి వీవోఏ లను గొడ్డు చాకిరీ చెపించుకున్నారని వాపోయారు. ప్రధానంగా కనీస వేతనం 26000,సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలి, ఎ= పాలసి వర్తింప జేసీ, సాధారణ భీమా 20లక్షలు అందించి, 58 జీవో ను సవరించి, ఆన్లైన్ పనులకు ట్యాప్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమం లో టీఆర్పి నాయకులు శంకర్ తదితరులు ఉన్నారు.



## బక్రీద్ ప్రార్థనలకు ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

: ఖానాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్

**ఖానాపూర్,మే 26(ప్రజా తీర్పు ప్రతినిధి):**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ఈద్గా వద్ద బక్రీద్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఖానాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్ తెలిపారు.మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్తో కలిసి ఈద్గా ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు త్రాగునీరు, పరిశుభ్రత,వీధి దీపాలు, శానిటేషన్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జవాన్ శంకర్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



## మాసాయిపేట్ మండల కేంద్రంలో కెనరా బ్యాంక్ మేనేజర్ కస్టమర్స్ తీవ్రమైన పడుతున్న కస్టమర్స్

**( వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) మే 26.**

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో గల కెనరా బ్యాంకులో బ్యాంకు మేనేజర్ దొండ పండు ప్రసాద్ బదిలీ పై వెళ్లడంతో అక్కడ నూతనంగా బ్రాంచ్ మేనేజర్ ని నియమించిన లీవ్ పెట్టి అతని ప్రమోషన్ ని క్యాన్సల్ చేయించుకోవడంతో ఇప్పుడు అక్కడ మేనేజర్ లేకపోవడంతో బ్యాంకులో లావాదేవీల కోసం వచ్చిన కస్టమర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఎండలో పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు, క్రాప్ లోను కోసం వచ్చిన రైతులు, ధాన్యం డబ్బుల కోసం వచ్చి నిరాశతో ఎదురు తిరుగుతున్నారు. కస్టమర్ తో బ్యాంక్ సిబ్బంది విసుగ్గా ప్రవర్తించడం మాసాయిపేట్ లో ఒకే బ్యాంకు ఉండడంతో మరో గత్యంతరం లేక అక్కడే ఎండలో నిల్చుంటున్నా రు. బ్యాంక్ ఆవరణ ఏటీఎం ఉన్న అందులో ఎప్పుడు డబ్బులు ఉండవని కస్టమర్ తెలిపారు. సమస్య తెలుసుకున్న సర్పంచ్ కృష్ణ రెడ్డి అక్కడికి చేరుకొని పై అధికారులకు విషయం తెలియజేసి నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి మండల స్థాయి నాయకులు బ్యాంకు కస్టమర్ గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత





రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 25**

రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం చేపట్టిన మహిళ వారోత్సవాలలో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ (సీతక్క), ఇతర మంత్రులు, ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మహిళ సంఘాల సభ్యులు, మహిళలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి తో పాటు సంక్షేమానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. మహిళలు ఆత్మస్థర్యంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం వివిధ వ్యాపార రంగాలలో మరియు మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం జరుగుతుందని, సోలార్ ప్లాంట్లు, ఆర్ టి సి బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి వ్యాపారాలను సైతం మహిళలు నిర్వహించేలా తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, రిలయన్స్ వంటి పెట్రో సంస్థల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక లబ్ధి జరిగేలా పెట్రోల్ బంకుల నిర్వహణకు చర్యలు చేపట్టడంతో పాటు ఆర్ టి సి సంస్థకు అద్దె బస్సుల ఒప్పందంతో అదనపు ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మహిళలను కోటీశ్వరులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ రుణాలను 5 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచి దాదాపు 60 వేల 471 కోట్ల రూపాయలు అందించడం జరుగుతుందని, వడ్డీ లేని రుణ సదుపాయం ద్వారా స్వయం సహాయక సంఘాలకు 1 వేయి 390 కోట్ల రూపాయలు అందించి వ్యాపార అభివృద్ధికి దోహదపడటం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తాము పొందిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా మరింత రుణ సదుపాయం కలుగుతుందని, మరింత మందికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 8 వేల 500 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేసి, లారీలు, హమాలీల సమస్య లేకుండా రైతు సంక్షేమంలో భాగంగా చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో స్వయం సహాయక సంఘాలకు భవిష్యత్తులో రైస్ మిల్లుల స్థాపన, నిర్వహణకు మహిళ సంఘాలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాల అధికారులు వారి జిల్లా పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి రైస్ మిల్లులు, గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వ భూముల అనుకూలతను పరిశీలించి నివేదిక సమర్పించాలని తెలిపారు. మహిళా శక్తి సూపర్ బజార్ ల ఏర్పాటుకు ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తుందని, నిత్యవసర సరుకులు, అత్యవసరాలు అన్ని సూపర్ బజార్ లో అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను మహిళా సంఘాలకు నామమాత్రపు అద్దె ప్రాతిపదికన కేటాయించి మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి చంద్రయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## వీవోఏల నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరింది

**ఖానాపూర్,మే 26(ప్రజా తీర్పు ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరింది.తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వీవోఏలు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాఖానాపూర్ పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట వీవోఏలు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు.కాగా కడెం మండలంలోని వీవోఏలు సమ్మె స్థలం నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ ఖాజా మొయినోద్దీన్కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.20 వేలును అమలు చేయాలని,సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఐఆర్ పాలసీ వర్తింపజేయాలని,అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి వీవోఏల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



## ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేయాలి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 26(ప్రజాతీర్పు ):**

జిల్లాలో ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా, నిరంతరాయంగా పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం లక్ష్మణచందా మండలంలోని తిరుపల్లి గ్రామంలోని గోదామును కలెక్టర్ సందర్శించి, ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వెంట వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గోదాం మొత్తం నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యం పరిమాణం, అన్లోడింగ్ కోసం వేచి ఉన్న ట్రాక్టర్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్యపై ఆరా తీసి, అవసరమైతే మరింత మంది హమాలీలను నియమించి అన్లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. హమాలీలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్ సరిత, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కరాటేలో వేములవాడ విద్యార్థుల సత్తా

### ప్రతిభావంతులకు మేయర్ కోలగాని శ్రీనివాస్ అభినందనలు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మే 24:**

కరీంనగర్ పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సూపర్ ఫైటర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో వేములవాడ ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించిన బి. క్రాంతికుమార్, బి. తపస్వి, ఎండి. ఆయాష్, బీఆర్. వేదత, ఎస్కే సాహిల్, వి. అవతిక, ఎండి. వసీం, ఆహిల్, ఎస్. శ్రీవల్లి, ఈ. నిపుణశ్రీ, డి. భవ్యశ్రీ, ఎన్. మనస్వినిలను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ వేదికపై అభినందించారు. భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలోవేములవాడ ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, సీనియర్ జర్నలిస్టు అబ్దుల్ మన్నాన్‌తో పాటు సీనియర్ కరాటే మాస్టర్లు కె. వసంత్‌కుమార్, మొండయ్య, సురభి వేణుగోపాల్, గౌరు రాజిరెడ్డి, ఇప్ప శ్రీనివాస్, కన క ర పు రాజ శేఖర్, వివిధ జిల్లాల కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.



## భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 26(ప్రజాతీర్పు ):**

అణగారిన బీసీ ఎస్సీ ఎస్టీల కోసం నిర్వహించబడుతున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అన్నేల లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 90 శాతం బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలు బానిసలుగా బ్రతుకుతున్నారని, పూలే అంబేద్కర్ కాన్సిరాం మార్గంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ చేస్తున్న చైతన్యంతో ఇటీవల నిర్వహించబడ్డ స్థానిక ఎన్నికల్లో చాలా మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. వేల సంవత్సరాలుగా నిర్మల్ గడ్డ అగ్రకులాల చేతుల్లో పరిపాలించబడుతూ, అణగారిన వర్గాలకు రావాల్సిన మొత్తం వాటాను దోచుకు తింటుందని విమర్శించారు. భూస్వాములు, దోపిడి స్వభావమున్న అగ్రకులాల కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అత్యవసరం ఉందని, భావితరాలను కాపాడ్డానికి బీసీ ఎస్సీ ఎస్టీ లోని విద్యావంతులు మేధావులు ముందుకు రావాలని అన్నారు. ఈనెల 27న చత్రపతి శంభాజీ మహారాజ్ ప్రాంగణం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న ముదిరాజ్, లీగల్సేల్ అడ్వైజర్ గొడుగు గంగాధర్, స్వామి పాల్గొన్నారు.

## రైతులు అపోహలు, వదంతులు నమ్మవద్దు

**(అరకిల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల మండల్) మే 26**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు అసత్య ఆరోపణలతో కలిగించే అపోహలు, వదంతులను రైతులు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో లారీల కొరత, కొనుగోళ్ళలో పూర్తిస్థాయి నిలిచిపోయిన పరిస్థితి లేదని, అవసరానికి అనుగుణంగా లారీలు, హమాలీలు, గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలో దాదాపు 1 లక్ష 50 వేల నుండి 1 లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుండగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు 1 లక్ష 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను 10 నుండి 12 రోజులలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళుతున్నామని, గతంతో పోలిస్తే ఈసారి కొనుగోలు, రవాణా ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని తెలిపారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ, పౌరసరఫరాలు, ఎస్.డబ్ల్యూ.సి. శాఖల అధికారులు నిరంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమానికి జిల్లా అధికార యంత్రాంగం కట్టుబడి ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని రైతులను కోరారు.

# నిర్మల్ పోలీస్...మీ పోలీస్

- జిల్లాలోని రెండు సబ్ డివిజన్లలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహణ
- పత్రాలు లేని 135 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, ఒక ఆటో స్వాధీనం
- ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి పాటించాలని పోలీసుల సూచన



**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 26(ప్రజాతీర్పు )**

జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు, మంగళవారం నిర్మల్ జిల్లాలోని రెండు సబ్ డివిజన్లలో నిర్మల్,భైంసా సబ్ డివిజన్లలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.భైంసా సబ్ డివిజన్ లోని భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్ బూరి గ్రామంలో, నిర్మల్ సబ్ డివిజన్ పెంబి మండలంలోని బావాపూర్ (ఆర్) గ్రామాల్లో, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా గ్రామ ప్రజలతో సమావేశమై గ్రామ భద్రత, నేరాల నివారణ, యువత భవిష్యత్తుపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 135 ద్విచక్ర వాహనాలను, రెండు కార్లను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అంతే కాకుండా వాహనాలకు సంబంధించిన పూర్తి సరైన పత్రాలు కలిగి ఉండాలని ప్రజలకు సూచించడం జరిగింది.అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటూ మొత్తం పెండింగ్ లో 105 చలాన్లు వసూలు చేసి, చలాన్లకు సంబంధించి మొత్తం 18,275 రూపాయల నగదు వసూలు చేయబడింది. ప్రజలకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి పూర్తిగా వివరించి, ప్రతి ఒక్క వాహన దారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలని తెలిపారు. అంతే కాకుండా గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి సామాజిక దుష్ప్రవర్తనలపై ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ, భైంసా ఏఎస్పీ, పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి సామాజిక దుష్ప్రవర్తనలపై ప్రజలకు వివరించారు. ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్,భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపీఎస్, ఖానాపూర్ ఇన్స్పెక్టర్ అజయ్,భైంసా రూరల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లు, పోలీసు సిబ్బంది, పెద్ద ఎత్తున స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పథకంలో కొత్త చట్టం!

### జూలై 1 నుంచి అమలు!

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 26**

కేంద్ర ప్రభుత్వం దేశ గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రాన్ని మార్చే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది దశాబ్దాలుగా అమల్లో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో, కొత్త చట్టాన్ని తీసుకువచ్చిం ది, కొత్తగా తీసుకువ చ్చిన వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీ వికమిషన్ గ్రామీణ, వీబీ-జీరామ్ జీచట్టం- 2025 ముసాయిదా నిబంధనలను కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసింది.ఈ చట్టం అమలు ఎలా, పనుల పర్య వేక్షణ బాధ్యత ఎవరిది, పథకానికి ఎవరు అర్హులు, పని దినాలెన్ని, వేతనాల చెల్లింపులు ఎలా, రాష్ట్ర ప్రభుత్వాల విధులేంటి.. అన్న అంశాలను అందులో పేర్కొంది.లబ్ధిదారులు ఉపాధి హామీ చట్టం నుంచి వీబీ-జీరామ్‌జీ చట్టానికి మారే ప్రక్రి యను వివరించింది.ఈ చట్టం దేశవ్యాప్తం గా జూలై 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో ముసా యిదా నిబంధనలపై అభ్యంతరాలుంటే జూన్ 21లోగా తెలియజేయాలని రాష్ట్రాలను, నిపుణుల ను, సంస్థలను, ప్రజా సంఘాలను కోరింది. ముసాయిదాలో పేర్కొన్న దాని ప్రకా రం.. వీబీ- జీరామ్‌జీ చట్టం అమలుకు కేంద్ర స్థాయిలో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తారు.ఇందులో కేంద్రగ్రామీ ణాభివృద్ధి శాఖ, నీతి ఆయోగ్ నుంచి ప్రతి నిధులు, కేంద్రమంత్రు లు, రాష్ట్రాల ప్రతినిధు లు సభ్యులుగా ఉంటా రు. ఇక, కేంద్రస్థాయి లోనే సెంట్రల్ గ్రామీణ్ రోజ్‌గార్ గ్యారంటీ కౌన్సిల్ పనులను పర్యవేక్షిస్తుంది. చట్టం అమలును చేస్తుంది,ఈ చట్టంలో ఒక కూలీకి ఏడాదిలో కల్పించాల్సిన పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచారు. కూలీలు కోరిన 15రోజుల్లోగా పని ఇవ్వాల్సి ఉంటుంది. లేకపోతే, వారికి భృతిని చెల్లిం చాలి. పని కల్పించడం ఆలస్యమైన మొదటి 30రోజుల్లో.. రోజువారీ గా కనీసం పావు వంతు వేతనం చెల్లించాలి. తర్వాత కూడా పని కల్పించక పోతే సగం వేతనాన్ని చెల్లించాలని ముసా యిదా నిబంధనల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేవైసీ చేసుకున్న వారందరినీ కొత్త చట్టం కింద గుర్తిస్తారు.




## పెట్రోల్ ధర పెంపుతో సామాన్యు లు, రైతులు విలవిల

**(పగడాల రామారావు) గార్ల మండల ప్రతినిధి ( మే 26**

గార్ల. ధరల మోతతో అందరికీ ఇబ్బందులు పెట్రోలు డీజిల్ ధరలను తగ్గించాలంటూ మంగళవారం స్థానిక మండల కేంద్రం చేపల మార్కెట్ యందు ట్రాక్టర్కు తాళ్లు కట్టి లాగుతూ నిరసన తెలియజేస్తున్న న్యూ డెమోక్రసీ కార్యకర్తలు రైతులు. మోడీ ప్రభుత్వం వైఫల్య చమురు దిగుమతులపై సమయానుకూలంగా వ్యవహరించకపోవడమే నేటి పెట్రోల్ ధర సంక్షోభానికి కారణమని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు దేశంలో పుష్కలంగా చమురు నిలువలు ఉన్నాయని చెప్పిన ప్రధాని ఎన్నికల తర్వాత ధరలు పెంచడం విచిత్రంగా ఉందని సామాన్యులపై మోయలేని భారంగా ఉన్న ఈ ధరల పెంపును మోడీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని మోడీ ప్రభుత్వ వైఫల్యమే ఈ ధరల పెరుగుదలకు కారణమని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి సక్రు అన్నారు ఈరోజు పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలంటూ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గార్ల మండల కేంద్రంలోని చాపల మార్కెట్ యందు ట్రాక్టర్ కు తాళ్లు కట్టి లాగుతూ నిరసన తెలియజేయడం జరిగింది అనంతరం న్యూ డెమోక్రసీ స్థానిక మండల కార్యదర్శి జి సక్రు మాట్లాడుతూ పెట్రోల్ ధరను విపరీతంగా పెంచడంతో అన్ని రంగాల సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఏర్పడిందని ముఖ్యంగా పంటల సాగులో రైతులు డీజిల్ను ఆధునిక వ్యవసాయ పరికరాలలోనూ ట్రాక్టర్లలోనూ వినియోగిస్తుంటారు ఇప్పటికే పంటలకు సరైన ధరలు రాక ఇబ్బంది పడుతున్న అన్నదాత పాలిట ఈ ధరలు పెంపు శాపంగా మారిందని రవాణా రంగంపై పెట్రోల్ ధర పెంపు ప్రభావం గణనీయంగా ఉంటుందని నిత్యవసర సరుకుల ధరలు ముఖ్యంగా కూరగాయల ధరలు గత వారం రోజులుగా పెరిగాయి నాలుగవసారి పెట్రోల్ ధరను పెంచడంతో వీటి ధరలు మరీ అంత పెరుగుతాయని సామాన్యులు ఆందోళన చెందుతున్నారని అన్నారు 10 రోజుల్లో నాలుగు సార్లు పెట్రోల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని సక్రు ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్ ధర పెంపుతో సామాన్యులు ఉద్యోగులు యువకులు అందరూ ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు తక్షణమే పెరిగిన డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు ఈ నిరసన కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ గార్ల మండల నాయకులు గౌని భద్రయ్య, ఎర్రి రవి, మాలోత్ మాన్య ,సూత్రపు మనోహర్, మట్టపల్లి వీరభద్రం చింతల గురవయ్య తాళ్లూరి లక్ష్మీనరసయ్య, సురేష్, రవి విశ్వనాథం పాల్గొన్నారు

# మున్సిపల్ కార్మికుల డిమాండ్లకు కమిషనర్ గ్రీన్ సిగ్నల్

- వడదెబ్బ బాధిత కుటుంబానికి ఉద్యోగ హామీ -- పని వేళల్లో మార్పు



**గోదావరిఖని మే 26 ,(ప్రజాతీర్పు ):**

రామగుండం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిషనర్ అరుణ శ్రీ హామీ ఇచ్చినట్లు మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. ఇటీవల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెరుపు సమ్మె అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అరుణ శ్రీతో జేఏసీ నాయకులు, కార్మికుల మధ్య చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు సమర్పించిన డిమాండ్ నోటీసుపై సుదీర్ఘంగా చర్చించిన కమిషనర్, ప్రధాన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వడదెబ్బతో మృతి చెందిన కార్మికురాలు మల్లమ్మ కుటుంబానికి ప్రభుత్వ పరంగా లభించాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. గతంలో మరణించిన లేదా పదవీ విరమణ పొందిన కార్మికుల కుటుంబాలకు వారసత్వ ఉద్యోగాల అంశాన్ని కూడా సానుకూలంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు.ఎండల తీవ్రత దృష్ట్యా పని వేళలను ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు మార్చేందుకు అంగీకరించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. అలాగే కార్మికులకు మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఈ నెల 27వ తేదీ నుంచి అందించనున్నట్లు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆదివారాలు, పండుగ సెలవులను అమలు చేయాలని కోరగా అందుకు కూడా కమిషనర్ అంగీకరించినట్లు తెలిపారు.మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బట్టలు, సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు, బెల్లం తదితర సరఫరాలతో పాటు 2025 ఫిబ్రవరి నుంచి ఇవ్వాల్సిన చీపుర్లు, పారలు, గంపలు, గ్లౌజులు, మాస్కులను మూడు నుంచి నాలుగు రోజుల్లో అందజేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.రిక్షా కార్మికుల నుంచి ఇంటింటికి తిరిగి డబ్బులు వసూలు చేసే విధానాన్ని రద్దు చేసి, ఇతర కాంట్రాక్టు కార్మికుల మాదిరిగా నేరుగా వేతనాలు చెల్లించే అంశాన్ని వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నట్లు తెలిపారు. గత కమిషనర్ హయాంలో ఇచ్చిన ప్రమోషన్లను కొనసాగించడంతో పాటు సొసైటీ పాత కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేయాలని కోరగా అందుకు అంగీకరించినట్లు వెల్లడించారు.సీనియర్లను పక్కనబెట్టి జూనియర్లను సూపర్వైజర్లుగా నియమించరాదని, బయోమెట్రిక్ సమస్యల కారణంగా కార్మికుల మస్టర్లలో కోతలు విధించరాదని కోరగా, ఇప్పటికే నష్టపోయిన కార్మికులకు మస్టర్లు రికవరీ చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, బీఆర్ఎస్ మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు నడిపెల్లి మురళీధర్ రావు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎంఏ గౌస్, సీఐటీయూ నాయకులు కిషన్ నాయక్, గుంజ రమణ, బీఆర్ఎస్ యూనియన్ నాయకులు వేల్పుల రాయమల్లు, రొడ్డ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దంపేట రచ్చగుట్ట తవ్వకాల అనుమతులు రద్దు చేయాలి

- ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా

**గోదావరిఖని, మే 26,( ప్రజాతీర్పు):**



పెద్దంపేట గ్రామ ప్రకృతి సంపదగా ఉన్న రచ్చగుట్టను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో నిర్వహించిన జిల్లా ముఖ్య సమావేశంలో పార్టీ పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్, మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, జిల్లా నాయకులు అడేపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య మాట్లాడారు. రచ్చగుట్టలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. రైల్వే, రహదారి పనుల పేరుతో గ్రామ చారిత్రక నేపథ్యం కలిగిన రచ్చగుట్టను కనుమరుగు చేసేందుకు ప్రభుత్వం, కొందరు రాజకీయ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రచ్చగుట్టను కాపాడేందుకు ముందుంటామని అధికార పార్టీ, గ్రామ పాలకవర్గం చేసిన ప్రకటనలను స్వాగతిస్తున్నామని తెలిపారు. అయితే మాటలకే పరిమితం కాకుండా తవ్వకాలను పూర్తిగా నిలిపివేసేలా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పాలకవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ, కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు. రచ్చగుట్ట తవ్వకాల వల్ల ఇప్పటికే ప్రాంతంలో కాలుష్యం పెరిగి ప్రజల జీవన విధానంపై ప్రభావం పడుతోందని అన్నారు. పెద్దంపేట గ్రామానికి గుర్తింపుగా ఉన్న రచ్చగుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పోరాట వారసత్వం కలిగిన పెద్దంపేట గ్రామ ప్రజలు రచ్చగుట్ట పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గూడూరు వైకుంఠం, తూల్ల శంకర్, మాజీ సర్పంచ్ మార్త రాధ, కోడిపుంజుల లక్ష్మి, బుర్ర బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



## వివాహ వార్షికోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

### కులాంతర వివాహాలకు రక్షణ కల్పించాలి : మద్దెల దినేష్

**గోదావరిఖని, మే 26 ,(ప్రజా తీర్పు):**

కులాంతర వివాహాలకు ప్రభుత్వాలు భద్రతతో పాటు ప్రోత్సాహకాలు అందించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా భార్య సౌజన్యతో కలిసి గోదావరిఖని మున్సిపల్ టి-జంక్షన్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. కుల వ్యవస్థ నిర్మూలనకు కులాంతర వివాహాలు అత్యంత అవసరమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భావించారని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని అనేక మంది యువత ఆదర్శ వివాహాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కులాలు, మతాలకు అతీతంగా వివాహాలు చేసుకోవడం ద్వారా సామాజిక ఐక్యత పెరుగుతుందని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో పరువు హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు సరైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "డాక్టర్ అంబేద్కర్ స్కీమ్ ఫర్ సోషల్ ఇంటిగ్రేషన్ త్రూ ఇంటర్ క్యాస్ట్ మేరేజెస్" పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రామగుండం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ. గౌస్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొని దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఈర్ల శ్రీనివాస్‌ను పరామర్శించిన గంట వెంకటరమణ రెడ్డి

**రామగిరి, మే 26 (ప్రజాతీర్పు)**



రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామం కురుమపల్లెకు చెందిన శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ షాపు యజమాని ఈర్ల శ్రీనివాస్ అనారోగ్య సమస్యతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మడి కమాన్ పూర్ మండలం మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, బేగంపేట గ్రామానికి చెందిన ఎరువుల బస్తాల డీలర్ గుండా శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఈర్ల శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని వైద్యుల ద్వారా చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈర్ల శ్రీనివాస్ త్వరగా పూర్తిస్థాయి ఆరోగ్యంతో కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.



## ఉచిత కంటి వైద్య మెగా శిబిరం నిర్వహించిన నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి.

- తన సొంత ఊరి రుణం తీర్చుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఆవుల రాజిరెడ్డి.

**(వంజరపు) ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట ) మే 26**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట్ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం నుండి ఆవుల రాజన్న స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి మండలానికి చెందిన ప్రజలు వచ్చి చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా వృద్ధులు కండ్లు సరిగా కనిపియ్యక తన పని తాను చేసుకోలేని స్థితిలో ఉన్నారని పోషకాహార లోపంతో బాధపడుతున్న క్యారెట్ చేపలు ఆహారం విటమిన్ ఈ లభిస్తుందని తెలిపారు. చక్కగా వైద్యులు సూచించినట్లు నియమాలు పాటిస్తూ తమ కండ్లను కాపాడుకోవాల్సిందిగా ఈ వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన గ్రామ ప్రజలకు, సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం తన సొంత గ్రామంలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఇలా ప్రతి మండల కేంద్రంలో రాబోయే రోజుల్లో కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరంలో అవసరమైన వారికి శాస్త్ర చికిత్స, మెడిసిన్స్, కన్సల్టేషన్, రవాణా ఖర్చులు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజు రెడ్డి, సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పసుల వెంకటేశం, డైరెక్టర్ ఉదండాపురం నర్సింలు, వార్డ్ మెంబర్స్, మండల స్థాయి నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుకు ఏఐ, రోబోటిక్స్ శిక్షణ దోహదం

- గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్య అందించడమే లక్ష్యం : కలెక్టర్ కోయ శ్రీహర్ష

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 26:**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, డిజిటల్ నైపుణ్యాల అభివృద్ధికి నిర్వహించిన "సూపర్ సమ్మర్ కంప్యూటర్, ఏఐ అండ్ రోబోటిక్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్" ఎంతో ఉపయోగపడిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. టి-ఫైబర్ సహకారంతో ఏప్రిల్ 27 నుంచి మే 26 వరకు నెల రోజులపాటు మంథని, పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్ కేంద్రాల్లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 312 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో ఆరు రోజులపాటు కంప్యూటర్, ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ స్కిల్స్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన "పెద్దపల్లి జిల్లా ఏఐ అండ్ రోబోటిక్స్ స్టూడెంట్ షోకేస్--2026"లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ ప్రశంసనీయమని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని నాలుగు ప్రాంతాల నుంచి ఎంపికైన విద్యార్థులు తమ ప్రాజెక్టులు, రోబోటిక్స్ నమూనాలు, ఏఐ ఆధారిత వినూత్న ఆలోచనలు, డిజిటల్ ప్రజెంటేషన్లతో ఆకట్టుకున్నారని తెలిపారు. భవిష్యత్తు సాంకేతికత ఆధారిత ప్రపంచంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ఆధునిక సాంకేతిక విద్యలో ముందుండాలని ఆకాంక్షించారు. గ్రామీణ విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్యల పరిష్కార సామర్థ్యం, సాంకేతిక అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించి భవిష్యత్తులో ఏఐ, రోబోటిక్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిపాలన అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆహ్వానితులు పాల్గొన్నారు.



## పంట అవశేషాలు కాల్చితే కఠిన చర్యలు

### పర్యావరణం, భూసారం దెబ్బతింటాయని హెచ్చరిక

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 26 :**

వరి కోతల అనంతరం పంట అవశేషాలను కాల్చడం వల్ల పర్యావరణానికి, భూసారానికి తీవ్ర నష్టం కలుగుతుందని, రైతులు అలాంటి చర్యలకు దూరంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. పంట అవశేషాల దహనంపై ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ చేపడుతున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో వరి పంట కోతల అనంతరం పంట అవశేషాలను విస్తృతంగా కాల్చుతున్న ఘటనలు గమనించబడుతున్నాయని తెలిపారు. పంట అవశేషాలను కాల్చినప్పుడు కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలై గాలి కాలుష్యం పెరుగుతుందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో ప్రజల్లో శ్వాసకోశ సంబంధిత సమస్యలు అధికమయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే పంట అవశేషాల దహనం వల్ల నేలలోని సేంద్రియ కర్బనం, నత్రజని, ఫాస్ఫరస్, పొటాష్ వంటి కీలక పోషకాలు నశించి భూసారం తగ్గిపోతుందని తెలిపారు. ఫలితంగా రైతులు అధికంగా రసాయన ఎరువులపై ఆధారపడాల్సి రావడంతో సాగు ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల మంటలు అదుపు తప్పి పక్కనున్న పంటలు, ఆస్తులు, విద్యుత్ లైన్లు దెబ్బతినే ప్రమాదం ఉందని, పశువులకు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా రోటవేటర్‌తో నేలలో కలియదున్నడం, కంపోస్ట్ లేదా వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పశుగ్రాసంగా వినియోగించడం, మల్చింగ్ పద్ధతులను అనుసరించడం వంటి ప్రత్యామ్నాయాలను అవలంబించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడే విధంగా రైతులు శాశ్వత వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## కస్టమర్ ప్యాంట్ జేబులో దొరికిన 60 వేలు యజమానికి అప్పగించిన డ్రైక్లీన్ సెంటర్ నిర్వాహకుడు

**రామగిరి, మే 26 (ప్రజాతీర్పు)**



రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీలో ఉన్న శ్రీ వెంకటేశ్వర డ్రై క్లీన్ సెంటర్‌లో నిజాయితీకి నిదర్శనంగా నిలిచే సంఘటన చోటుచేసుకుంది. డ్రై క్లీన్ సెంటర్ నిర్వాహకుడు ధూర్శెట్టి రవి ఇస్త్రీ పనులు నిర్వహిస్తుండగా ఒక కస్టమర్ ప్యాంట్ జేబులో రూపాయలు 60, 000 నగదు కనిపించింది. వెంటనే ఆ డబ్బు ఎవరిదో తెలుసుకునేందుకు ప్రయత్నించిన రవి, ఆ నగదు మొగిలి అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించాడు. అనంతరం ఎలాంటి స్వార్థం లేకుండా ఆ మొత్తాన్ని సంబంధిత యజమానికి అప్పగించాడు. రవి చూపిన నిజాయితీని స్థానికులు అభినందిస్తూ, ఇటువంటి విలువలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ ఘటనతో ధూర్శెట్టి రవి నిజాయితీపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఉపకార వేతనాల దరఖాస్తు గడువు పొడిగింపు

### మే 31 వరకు అవకాశం

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 26 :**

ప్రభుత్వం అందిస్తున్న ఉపకార వేతనాల దరఖాస్తు గడువును మే 31, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల కోసం విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లోని అర్హులైన ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు వశ్రీఖఅ-త్రుఖఋవజూఖం.ఎన్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ?? ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8790153484 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ సూచించారు.

## ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి

**గోదావరిఖని మే 26,(ప్రజా తీర్పు):**



పాలకుర్తి మండలంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియలో అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై "బి-కేటగిరి" పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తేమ శాతం పేరుతో ధాన్యానికి కోతలు విధించడం, "తాలు", "తరుగు" పేరుతో అధిక మోతాదులో కోతలు పెట్టడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా తార్పాలిన్లు అందుబాటులో లేక వర్షాల సమయంలో ధాన్యం తడిసి రైతులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి కేంద్రంలో తార్పాలిన్లు, తాగునీరు, షెడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగితే బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిప్పని రాజకుమార్, కంకట శ్రీనివాస్, గోపు రామయ్య, కొలిపాక శంకరయ్య, రావుల చిన్నన్న, వేల్పుగొండ సంపత్, పూసాల శంకరయ్య, జట్పుట్ తిరుపతి, కొమురె లక్ష్మణ్, మబ్బు సాయికిరణ్, నందీష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## "అహంకారం, అవాస్తవాలే బీఆర్ఎస్ పతనానికి కారణం : ఆసర్ల బీరప్ప"

### అహంకారపు మాటలతోనే ప్రజలు కేటీఆర్‌ను గద్దె దించారు.

**బోడుప్పల్, మే 26 ( ప్రజాతీర్పు )**



ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మీడియాతో మాట్లాడిన యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మేడ్చల్ నియోజకవర్గంలోనే వేలాది ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణాలు కొనసాగుతున్నాయని, కావాలంటే ఆధారాలతో నిరూపిస్తామని ఆయన తెలిపారు. "వేల ఇందిరమ్మ ఇళ్లు చూపిస్తా... కేటీఆర్ రాజకీయ సన్యాసానికి సిద్ధమా?" అంటూ సవాల్ విసిరారు. "అబద్ధాల ప్రచారమే కేటీఆర్ రాజకీయాల పునాది" అని విమర్శించిన బీరప్ప, పదేళ్లు అధికారంలో ఉండి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రచారం చేసి వేలాది పేదలను నిరాశపరిచిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్లపై మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. "కాంగ్రెస్ పనులు కనిపించకపోతే కేటీఆర్ రాజకీయ కళ్లజోడు మార్చుకోవాలి. పేదల ఇళ్లపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు" అని వ్యాఖ్యానించారు. అలాగే "ఇలాంటి అహంకారపు మాటలతోనే ప్రజలు కేటీఆర్‌ను గద్దె దించారు. అహంకారం, అవాస్తవాలే బీఆర్ఎస్ పతనానికి కారణం" అని బీరప్ప విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకుని, బీఆర్ఎస్ హయాంలో నెరవేరని హామీలపై ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



## కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి -జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత

**(చంద్రశేఖర్ ప్రజా తీర్పు బీర్పూర్ మండలం ) మే26**

బీర్ పూర్ మండల కేంద్రం, తాళ్ల ధర్మారం, కొల్వాయి, గ్రామల్లో ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలోఅందుబాటులోఉండేలాచర్యలుతీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలనిఆదేశించారు. అలాగే ట్రక్ షీట్నమోదు,ట్యాబ్ ఎంట్రీలువంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తిచేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం,నాణ్యతప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్, డీటీ, సంబంధిత శాఖలఅధికారులు,సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## ఖానాపూర్ వాసవి మాత ఆలయంలో ఘనంగా అధికమాస పూజలు

**ఖానాపూర్,మే 26(ప్రజా తీర్పు ప్రతినిధి):**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని వాసవి మాత దేవాలయంలో అధికమాసాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పట్టణ ఆర్యవైశ్య సంఘం,మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీ అభిషేక్ శర్మ ఆధ్వర్యంలో సుదర్శన హోమం,తులసి అర్చనలు నిర్వహించారు.ఈ సందర్భంగా 33 మంది బ్రాహ్మణులకు మొంటేలా వాయినాలు,అధికమాస వాయినాలు అందించి ఘనంగా సత్కరించారు.పలువురు మహిళలు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మహాజన్ జలంధర్,కోశాధికారి సామ లక్ష్మీనారాయణ,ప్రార్ధన కార్యదర్శి కూరగాయల విలాస్, ఉపాధ్యక్షుడు ముక్క కిషన్,వాసవి క్లబ్ ఆర్సీ మహాజన్ జితేందర్,వాసవి క్లబ్ అధ్యక్షులు రవీందర్, మహిళా సంఘం అధ్యక్షురాలు గోలి పద్మజ,కోశాధికారి కట్కం స్వరూప రాణి,ప్రార్ధన కార్యదర్శి నీలి శ్రీలత,అక్షంతల భార్గవి విశ్వనాథుల సుజాత,రాచ పద్మ, చిటికేసి రాణి, సామ ప్రతిభ,మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 26**

మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు. జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు, యువత డ్రగ్స్ వినియోగించకుండా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్స, మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యాసంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పద్మ నాయక పురస్కారాలు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 26.**



జగిత్యాల పట్టణ పద్మనాయక కళ్యాణ మంటపం లో వెలమ సంక్షేమ మండలి జగిత్యాల వారి ఆధ్వర్యంలో మంగళవారం 2025-26 విద్యా సంవత్సరానికి ఉత్తమ మార్కులు సాధించిన వెలమ కుల విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేసి,అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ,వెలమ కార్పోరేషన్ చైర్మన్ జువ్వాడి నరసింగరావు . ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు,వెలమ సంక్షేమ సంఘం సలహాదారు ఓరుగంటి రమణ రావు, కె డి సి సి జిల్లా మెంబర్ ముప్పాళ్ళ రామచందర్ రావు,వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆయిల్నేని సాగర్ రావు,ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్ రావు,మాజీ అధ్యక్షులు పురుషోత్తం రావు,రామచందర్ రావు,కొలుగురి దామోదర్ రావు,వెంకటేశ్వర రావు,నాయకులు నరేందర్ రావు,కార్యవర్గసభ్యులు ,వెలమ సంక్షేమ సంఘం కుల భాందవులు,తదితరులు పాల్గొన్నారు.'

# ప్రశ్నించే గొంతుకను అనచడమే కాంగ్రెస్ ధ్యేయం

- సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం దృష్టి సారించాలి
- బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి

**జగిత్యాల, మే 26 ప్రజా తీర్పు**



జగిత్యాల : ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించే గొంతుకలను అణిచివేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ భోగ శ్రావణి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బిజెపి జగిత్యాల నియోజకవర్గ కార్యాలయం కమల నిలయంలో ప్రత్యేక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇటీవల కేంద్రీయ విద్యాలయం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించారని, అయితే పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతలు ధర్నా చేయడానికి పోలీసులు ఏ విధంగా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. తమకో న్యాయం, అధికార పార్టీ నేతలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. శాంతియుతంగా చేసే దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించి, కాంగ్రెస్ నేతలు చేపట్టిన ధర్నాకు మాత్రం పోలీసులు అనుమతి ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ధర్నా ముసుగులో అన్ని రకాల దుకాణాలను బందు చేయించి, అత్యవసర సమయంలో ఉపయోగపడే మెడికల్ దుకాణాలను సైతం మూసి వేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఓవైపు ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగక కల్లాలు సక్రమంగా ఏర్పాటు చేయక రైతులు దాన్యం ఆరబెట్టుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఒక బస్సు డ్రైవరు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించగా అతని ఉద్యోగాన్ని తొలగించి రోడ్డుపైన వచ్చే విధంగా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించిన ప్రతి ఒక్కరిని ఇబ్బందులకు గురి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటేనన్నారు. పెట్రోల్, డీజిల్ పై దేశంలోనే ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధికంగా ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ జోడించి ఎక్కువ రేటుకు పెట్రోల్, డీజిల్ అమ్ముతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ రేట్లను ప్రజలు గమనించాలని కోరారు. అడ్డగోలుగా ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ పెంచుతూ సామాన్య జనాన్ని ఇబ్బందులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వంమానుకోవాలన్నారు. అంతేకాకుండా ఇటీవల నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జగిత్యాల నియోజకవర్గానికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించగా దానిపైన కూడా రాజకీయం చేస్తూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అనుకూలమైన స్థలం కేటాయించకుండా కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనువైన స్థలాన్ని కాకుండా తన స్వలాభం కొరకు తనకు నచ్చిన ప్రాంతంలో స్థలానికి కేటాయించడానికి ప్రయత్నిస్తుండడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలోఇంతజరుగుతున్నప్పటికీ జిల్లాకు చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ఏ విధంగా కూడా స్పందించకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ప్రజల సమస్యలు పరిష్కరించలేని మంత్రి ఉండి కూడా లాభం లేదని విమర్శించారు. డ్యూటీ నుంచి తొలగించిన ఆర్టీసీ డ్రైవర్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని, ఐకెపి కేంద్రాల్లో కొనుగోలు సజావుగా జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో బిజెపి తరఫున భారీ ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్,42వ వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, దూరిశెట్టి మమత, సిరిపురం శ్రీనివాస్, గట్టి పెల్లి జ్ఞానేశ్వర్,పవన్ సింగ్, చిట్యాల రాము, గడ్డల లక్ష్మి, మేడిపల్లి పుష్ప రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు



## రేచపల్లిలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం


### చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ తెలంగాణ" కార్యక్రమంలో గ్రామస్తులకు సూచనలు

**సారంగాపూర్ మే 26 (ప్రజా తీర్పు)**

మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఉమెన్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా రేచపల్లి గ్రామపంచాయతీలో "చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ తెలంగాణ" అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బాస మహేష్ మాట్లాడుతూ.. గ్రామంలో బాల్యవివాహాలు జరగకుండా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. బాల్యవివాహాల వల్ల పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని గ్రామస్తులకు వివరించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ లత మాట్లాడుతూ.. "బాల్య వివాహాలు -- బతుకు ఆగం" అనే నినాదంతో బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వల్ల పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి దెబ్బతింటుందని తెలిపారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా 1098, 181, 100 హెల్ప్‌లైన్ నంబర్ల గురించి కూడా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంతోష్, వార్డు సభ్యులు రమేష్, ఆనంద్ మహేష్, అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, పిల్లలు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారి రిమాండ్

**(నార కట్లమధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 26**



ఈరోజు అనగా తేదీ ఈరోజు అనగా తేదీ 26 5 20 26 రోజున ఉదయం రుద్రంగి ఎస్సై ఎం మోతీరాం గారికి వచ్చిన నమ్మదగిన సమాచారంపై రుద్రంగి గ్రామంలోని దువ్వాక గంగ శేఖర్ తండ్రి నరసయ్య అను అతను తన ఇంటిలో అధిక వడ్డీల వ్యాపారం నడిపిస్తున్నాడని అధిక వడ్డీకి డబ్బులు ఇచ్చి ప్రజలను ఇబ్బంది గురి చేస్తున్నాడని నమ్మదగిన సమాచారం రాగా రుద్రంగి ఎస్ఐ గారు తన సిబ్బందితో కలిసి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు దువ్వాక గంగ శేఖర్ ఇంటికి వెళ్లి తనిఖీలు చేయగా అతని ఇంటిలో 32 ప్రామిసరీ నోట్స్ వాటి విలువ సుమారు 70 లక్షలు, 5 చెక్కులు మరియు రెండు బాండ్ పేపర్లు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని అట్టి వ్యక్తిని పిఎస్ కి తీసుకొని వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది. ఇకపై ఎవరు అధిక వడ్డీ వ్యాపారం నడిపి సాధారణ ప్రజలకు ఇబ్బంది గురిచేసిన వారిపై చట్టపరిచే చర్యలు తీసుకుంటామని, ఎవరైనా అధిక వడ్డీ వ్యాపారం ఎవరు నడిపిన వారి వివరాలు ఎవరైనా తెలిపినట్లు ఉంటే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని రుద్రంగి ఎస్సై గారు తెలపడం జరిగింది.



## ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తాం

### కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 25 :**

ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరపున ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ప్రశ్నిస్తామని పెద్దపల్లి పట్టణ బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వరి ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై ప్రతిపక్షంగా స్పందిస్తే కాంగ్రెస్ నేతలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ఇప్పుడు ప్రారంభోత్సవాల పేరిట కాంగ్రెస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఇప్పటికైనా విమర్శలు మానుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కొందరు కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం, ఎమ్మెల్యే దృష్టిలో పడేందుకు ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే వద్ద ఆశ్రయం పొందిన వారే ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని, మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, పెద్దపల్లిలో దాసరి మనోహర్‌రెడ్డి విజయం ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాశిపాక వాసు, ఎండీ ముఖిం, బొడ్డుపల్లి రమేష్, ఫహీం, పల్లె మధు, ఎండీ రఫీ, కుక్క మనోజ్, ఆదిల్ ఖాన్, ఎండీ అతీక్, ఎండీ ముజాషిర్, అజర్, జూబేరీ పాల్గొన్నారు.

## నత్తన నడకన సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట)మే 26**



తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం ఒక ప్రకటనలో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాసులు కుప్పలు, తెప్పలుగా ఉన్నాయని, సరియైన టైం కు లారీలు రాక, కొనుగోలు పక్రియలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఆవేదనకు గురి అవుతున్నారని అన్నారు. ఒక వైపు రోహిణి కార్తె సమిపించిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తరలించక దిక్కుతోచని స్థితిలో రైతులు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారని, ఒక వైపు ధాన్యం కొనుగోల్లు వేగంగా జరుగుతున్నాయని గప్పాలు కొట్టె నాయకులు, అధికారులు ఒక్కసారి కొనుగోలు కేంద్రాలకు వచ్చి చూస్తే రైతుల పరిస్థితి అర్థం అవుతుందని ఎద్దేవ చేసారు. అలాగే నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో మొక్క జొన్న, పొద్దుతిరుగుడు పంటలను కూడా కొనుగోలు చేయాలనీ, కొనుగోలు కేంద్రాలకు సకాలంలో లారీలు, గన్నీ సంచులు వచ్చేలా చూడాలని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే రైతుల పరిస్థితి దృష్టిలో ఉంచుకుని కొనుగోలు పక్రియ వేగవంతం చేసి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్, మండల అధ్యక్షుడు ఎల్లోజీ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుంది

### జిల్లా కలెక్టర్ కె హైమావతి

**సిద్దిపేట మే 26 (ప్రజా తీర్పు ప్రతినిధి )**



జిల్లాలో అకాల వడగండ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిందని, అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు యుద్ధప్రాతికన లిఫ్ట్ చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం చిన్నకోడూరు మండలంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం మరియు జిల్లా కేంద్రంలోని ఆధునిక వ్యవసాయ మార్కెట్ కమిటీ లో కొనుగోలు మరియు దిగుమతి ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందని, కానీ జిల్లాలో వాతావరణ శాఖ అకాల, వడగండ్ల వానలు కురిసే ఆస్కారం ఉన్నట్లు హెచ్చరికలు జారీచేసిందని వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని కొనుగోలు వేగవంతం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఏఎంసి లలో ప్రస్తుతానికి ఉన్న ధాన్యాన్ని వెంటనే లిఫ్ట్ చేసి స్థానిక గోదాం లో దిగుమతి చెయ్యాలని ఆదేశించారు. చిన్నకోడూరు ఏఎంసి వద్ద రోడ్లపైన ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే గన్నీలలో నింపి లిఫ్ట్ చేసేందుకు రెడీ గా ఉండాలని తెలిపారు. చిన్నకొడూరు గ్రామంలో ఎక్కువ మొత్తంలో ధాన్యం ఉన్నందున గోదాం లో దిగుమతికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎత్తు ప్రాంతాల్లో ధాన్యంన్నీ ఉంచి టర్పాలిన్ కప్పాలని, అకాల వర్షాల వరదలలో ధాన్యం కొట్టుకుపోకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా రైతాంగానికి సూచించారు. వరి, మక్కలు కొనుగోలు ఒకే సారీ చేయడం మూలంగా హమాలీ, లారీల కొరత ఏర్పడిన ఒక్కొక్కటిగా ఒక ప్రణాళిక ప్రకారం కొనుగోలు వేగవంతం చేస్తున్నామని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం సన్ ఫ్లవర్ సైతం కొనుగోలుకు అనుమతినిచ్చింది కావున పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులు సంయమనం పాటిస్తూ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


# ఖబర్దార్ కొప్పుల ఈశ్వర్..

- నోరు ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు..
- ప్రజల మధ్య ఉంటున్న ప్రజా ప్రతినిధిని నేను..
- మాజీ మంత్రి కొప్పుల పై మంత్రి అడ్లూరి ఫైర్..

**(జంగ మహేందర్ యాదవ్, ప్రజా తీర్పు ధర్మారం) మే 26**



నోరు ఉందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ప్రజల కోసం పనిచేస్తున్న తనపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యులపై మోయలేని భారం పడుతుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సంక్షేమాన్ని మరిచిపోయారని మంత్రి అడ్లూరి అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా భవన్ నిర్మాణం చేసుకుంటే కేటీఆర్, హరీష్ రావులు జన్వాడ లో ఫామ్ హౌస్ నిర్మాణం చేసుకున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ఏనాడు విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయలేదని మంత్రి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో సంక్షేమానికి ఒక వసతిగృహం నిర్మించలేదని మంత్రి ఆరోపించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ధర్మారం మండలంలోని మిగులు భూములను పేద ప్రజలకు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు. ఇప్పటికే ధర్మారం మండలంలోని బొమ్మ రెడ్డి పల్లి లో 79 ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి విడిపించామని నర్సింగాపూర్ లో అనర్హుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను తీసుకొని పేద ప్రజలకు పంపిణీ చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు 2023 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నానని మంత్రి అన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారని ప్రజల పక్షాన ఉన్న తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న ఈశ్వర్ కు హితబోధ చేస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రూప్ల నాయక్ వైస్ చైర్మన్ అరిగేలా లింగయ్య కొత్త నరసింహులు మాజీ ఎంపీపీ కోడారి అంజన్న రంజిత్ యాదవ్ దేవి జనార్దన్ యశోద అజయ్ వేల్పుల నాగరాజు ఆవుల మల్లయ్య పాలకుర్తి రాజేశం సుర వెంకటేశ్ వీర్ పాల్ అజయ్ పాల్ రెడ్డి ధ్యాగేటి ఉదయ్ ఉప సర్పంచ్ ఎలిగేటి మల్లేశం సంతోష్ ఎల్లయ్య వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు





## నందుపల్లి గ్రామంలో.. బాల్య వివాహాల అవగాహన సదస్సు= బాల్య వివాహాలు చట్టరీత్య నేరం దేశపాగ నరసింహ

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.26**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని నందు పల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ ఆధ్వర్యంలో.. బాల్య వివాహాల అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది 18 సంవత్సరాలలోపు బాలికలకు, 21 సంవత్సరాలలోపు బాలుడికి పెళ్లి చేయటం చట్ట విరుద్ధం అన్నారు బాల్యవివాహం జరిపించిన లేదా పాల్గొన్న ఏ వ్యక్తికైనా రెండు సంవత్సరాల కార్యగర శిక్ష మరియు లక్ష రూపాయల వరకు చేరినామా ఉంటుందని పేర్కొన్నారు.. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే వెంటనే ఈ నెంబర్ లకి 1098 100 112 181 ఫోన్ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు ఈ యొక్క కార్యక్రమంలో... ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామస్తులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.





## మహేశ్వరం ఎంపీడీవో ని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య


**(వై యాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే. 26**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని ఎంపీడీవో శారదమ్మని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవుల యాదయ్య...మహేశ్వరం ఎంపీడీఓ నూతన బాధ్యతలు చేపట్టిన శారదమ్మని,మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా ఆవుల యాదయ్య మాట్లాడుతూ ప్రజాసేవలో ప్రభుత్వ పథకాలపై స్కీములు కొత్త పింఛన్లు గుడిసెలు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్లు,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ జీరో' బిల్లులు మహేశ్వరం మండలంలో ఉన్న ప్రతి గ్రామాలలో అందించాలని మరియు ఈ యొక్క ప్రభుత్వ స్కీములు ప్రతి గ్రామంలో అర్హులైన అందరూ వినియోగించుకోవాలని కోరారు,ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కమ్మరి యాదయ్య పాల్గొన్నారు.

## సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ జరగనివ్వము..!!

### ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు ఇల్లందు) మే 26**





ఇల్లందు :పూసపల్లి నూతన ఓసి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేవుకేవలం కొంత మంది వ్యక్తుల స్వార్థం కోసమే బినామీల పేర్ల భూములను పేర్లను చేర్చడం వల్లేనే కేవలం వారి స్వలాభం కోసం నూతన ఓసి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుంది–ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఽ నియోజకవర్గ బి ఆర్ స్ పార్టీ ఇంఛార్జ్ శ్రీమతి బాణోతు. హరిప్రియ నాయక్.అన్నారు హైదరాబాదు తెలంగాణ భవన్ లో టి బి జి కె స్ అధ్యక్షులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో టి బి జి కె స్ అధ్యక్షుడు మిరియాల రాజి రెడ్డి అధ్యక్షతన జరిగిన జరిగిన టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఇల్లందు మాజీ శాసనసభ్యులు బి ఆర్ స్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ శ్రీమతి బాణోత్. హరిప్రియనాయక్ పాల్గొనడం జరిగింది..ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించిమాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బాణోత్. హరిప్రియ నాయక్ మాట్లాడుతూగతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బొగ్గుకు నిలయమైన బొగ్గుకు పుట్టినిల్లు అయిన ఇల్లందు చరిత్ర ఓసి మూతివేతతో ఖాళీ అవుతుంది అనగానే ఇల్లందు చరిత్రను కాపాడుకోవడం కోసం ఆనాటి తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ తో మాట్లాడి పూసపల్లి ఓసిని నూతన ఓసిగా ఏర్పాటు చేసే విధంగా పెద్ద ఎత్తున ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగింది. దానిలో భాగంగానే పబ్లిక్ హియరింగ్ ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ అన్ని జరిగినప్పటికీ,నేటికీ పూసపల్లి ఓసి ప్రారంభోత్సవం అనేది నత్తనడకన ఎందుకు నడుస్తుంది అనేది పెద్ద ప్రశ్న..ప్రస్తుత సమాచారం మేరకు పూసపల్లి ఓసి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోయినప్పటికీ ఇల్లందులో ప్రస్తుతం కొంతమందిబినామీ పేర్లను ఉన్నట్లుగా చిత్రీకరించడం వల్ల తీసుకున్న భూములు ఏవైతే ఉన్నాయో అవి భూ సేకరణ టైంలో కట్ ఆఫ్ పెట్టడం జరిగింది. నూతన ఓసి ప్రపోజల్ కి ముందు మరియు తర్వాత విపరీతంగా భూ నిర్వాసితుల సంఖ్య పెరగడంతో, నూతన ఓసి నిర్మాణ వ్యయం పెరగడంతో పూసపెల్లి నూతన ఓసి నిర్మాణానికి తీవ్ర జాప్యం జరుగుతుందని, ఒక్కరికి లబ్ది వల్ల ఇల్లందు ప్రాంతం మొత్తం తీవ్రంగా నష్టపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు దేశానికి వెలుగులు అందించే ఈ యొక్క సింగరేణి సంస్థకు వందల ఏళ్ల సుదీర్ఘమైన చరిత్ర ఉందని తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ మార్గ నిర్దేశంతో రాబోయే ఎన్నికలలో ఎవరైతే తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా కారుణ్య నియామకాల కింద నియమింపబడ్డ యువ కార్మికుల సంపూర్ణ సహకారంతో వారి చురుకైన పాత్రతో కేసీఆర్ ని ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేసే విధంగా అందరం అంకితభావంతో పనిచేయాలని సూచించడం జరిగింది

## జాతీయ సదస్సులో రంగారెడ్డి జిల్లా ఎస్సీ చైర్మన్‌గా క్యారగారి శ్రీధర్‌కు నియామక ఉత్తర్వులు

**(వైయాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.26**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కి చెందిన క్యార గారి శ్రీధర్ మాట్లాడుతూ.....న్యూఢిల్లీ లో ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ ఆధ్వర్యంలో 15 రాష్ట్రాల ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ల జాతీయ సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధినాయకుడు,భారత ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరై,ఎస్సీ వర్గాల సాధికారత,సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబాటును పునరుద్ఘాటించారు.కార్యక్రమం అనంతరం ఎస్సీ డిపార్ట్మెంట్ నూతన జిల్లా చైర్మన్లకు నియామక ఉత్తర్వులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్‌గా నియమితులైన క్యారగారి శ్రీధర్ కి రాజేంద్ర పాల్ గౌతమ్,ఏఐసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ నగరిగారి ప్రీతం, అలాగే టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మనకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా ఉత్తర్వులు అందజేశారు.ఈ నియామకం పట్ల జిల్లా నాయకులు,పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ,క్యారగారి శ్రీధర్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీకి మరింత బలం చేకూరుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## పహాడీ షరీఫ్ 64 డివిజన్‌లో ఘనంగా హెల్త్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డ్‌ల పంపిణీలో పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి

**(వై యాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే. 26**



ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం పహాడీ షరీఫ్ 64 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ యూసుఫ్ ఖాద్రీ ఆధ్వర్యంలో హెల్త్ కార్డ్ మరియు ఆరోగ్యశ్రీ కార్డ్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...పేద, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం భారంగా మారకూడదనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డుల ద్వారా ఉచిత వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తోందని అన్నారు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్,భూపాల్ రెడ్డి ఫాజిల్ ఖాద్రీ, భాను,వసీం, రజనీకాంత్ గౌడ్,నిసార్ హసన్,ఒమర్,హబీబ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద పాల్గొన్నారు....



## కరీంనగర్ కార్పొరేషన్ ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 26**

కరీంనగర్ కార్పొరేషన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం 48 గంటల్లోనే అర్బన్ చాలెంజ్ ఫండ్ 840 కోట్లు మంజూరు చేయించినట్లు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కేంద్రం మంజూరు చేసిన 840 కోట్ల రూపాయలతో కరీంనగర్ పట్టణం రూపురేఖలే మార్చుతామని ప్రకటించారు. శివారు కాలనీలకు ప్రాధాన్యత ఇస్తామని, రోడ్లు, పార్కులు, పార్కింగ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు అన్ని చేపడతామని ప్రకటించారు. కార్పొరేషన్ ప్రజా ప్రతినిధులు అభివృద్ధి విషయంలో గల్లా ఎత్తుకొని తిరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ కు అవసరమైన నిధుల వరద ప్రారిస్తానని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని ఇచ్చిన మాట ప్రకారం 100 రోజుల్లోపే రూ840 కోట్లు నిధులు తీసుకొచ్చినట్టు సంజయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రదాని మోదీ, కేంద్ర మంత్రి కట్టర్ లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించిందని, కష్టపడి ప్రతిపాదనలు రూపొందించి వెంట వెంటనే పంపిన జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సహా అధికారులను మేయర్ డిప్యూటీ మేయర్ ల కృషిని అభినందించారు. దేశవ్యాప్తంగా 17 ప్రాజెక్టులకు మాత్రమే కేంద్రం ఆమోదం తెలిపిందని,అందులో కరీంనగర్ ఉండటం మనందరికీ గర్వకారణం అన్నారు. డంపింగ్ యార్డు కోసం రూ.80 కోట్లు విడుదలయినట్టు మంత్రి సంజయ్ తెలిపారు. గతంలోనూ రూ.900 కోట్ల స్మార్ట్ సిటీ నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేసినం, అమృత్ 1, 2 ద్వారా రూ.277 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. శివారు ప్రాంతాలను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తన ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో రూ.20 వేల కోట్లకుపైగా నిధులు తీసుకొచ్చినట్టు తెలిపారు. శాతవాహన కాలేజీకి 12బి హోదా, న్యాయ కళాశాల మంజూరు చేయించినట్లు తెలిపారు.అలాగే ఎస్సారార్ కాలేజీకి అటానమస్ హోదా తెచ్చినట్టు చెప్పారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం అభివృద్ధి, జమ్మికుంట స్టేడియం నిర్మాణం కోసం నిధులు తెచ్చిట్టు పేర్కొన్నారు. సీఎస్సార్ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ ఎక్విప్ మెంట్స్, ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందించిన విషయం మంత్రి సంజయ్ గుర్తు చేశారు. కేంద్ర పారామిలటరీ గ్రూప్ సెంటర్ ఏర్పాటుకు 14 ఎకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బెటాలియన్ల ఏర్పాటుకు క్రుషి చేస్తున్నట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు కార్పొరేటర్లు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రాష్ట్రం విఫలం

- ప్రతిపైసా కేంద్రమే ఇస్తున్నా ఎందుకీ వైఫల్యం
- జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని రైతుల ఇబ్బందులను తీర్చండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 26**



ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రమే ఇస్తున్నప్పటికీ, వడ్ల కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతగావడం లేదని మండిపడ్డారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకే “రైతు గోస బీజేపీ భరోసా” పేరుతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈరోజు 1 కోటి 39 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం రెండో అంతస్తు నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. వీటితోపాటు కార్మిక ఆరోగ్య సంక్షేమ భవన పునరుద్ధరణ, షెడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. వడ్ల కొనుగోలు అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పై విధంగా స్పందించారు. ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రానివా? రాష్ట్రానివా? సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుతిలీతాడు మొదలు రవాణా ఖర్చులన్నీ కేంద్రమే ఇస్తోందన్నారు. “వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తి మాత్రమే. మధ్యవర్తిత్వం చేసినందుకు కేంద్రం రాష్ట్రానికి కమీషన్ కూడా ఇస్తోంది. అయినా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విఫలమవుతోంది.”అని విమర్శించారు. ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని సూచించారు. “ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేయండి. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వండి. పొరపాట్లు జరిగిన చోట గుర్తించి వెంటనే సరి చేసుకుని వడ్లను కొనుగోలు చేయాలి. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు బీజేపీ రైతు గోస బీజేపీ భరోసా పేరుతో యాత్రలు చేస్తున్నాం.”అని తెలిపారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020